
బుధవారం 11 మార్చి 2026 https://www.telugudesam.org



# చైతన్యరథం




సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు



వడగాడ్పులపై
## అప్రమత్తం
- వివరాలు 9 లో..

'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్
## మెటీరియల్ హబ్'గా ఏపీ




- త్వరలో టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్
- వచ్చే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- గనుల శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు అధికారుల ప్రతిపాదన

- వివరాలు 3 లో..

తెలుగు వైభవానికి
# అమరావతి ప్రతీక

- సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై దృష్టి సారించండి
- క్రీడలు, పర్యాటకానికి పెద్ద పీట వేసేలా ప్రణాళికలు
- పెట్టుబడులతో వచ్చే సంస్థలతో నిరంతర సంప్రదింపులు
- 59వ సీఆర్డీఏ అథారిటీ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- భూకేటాయింపులు సహా వివిధ ప్రతిపాదనలకు అథార్టీ ఆమోదం

2



తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా... భావితరాలకు అందించేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజధానిలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. సమావేశంలో రాజధానిలోని వివిధ సంస్థలకు జరపాల్సిన భూకేటాయింపులు, సెక్రటేరియేట్, హెచ్‌వోడీ భవనాల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. సీఆర్డీఏనుంచి వచ్చిన వివిధ ప్రతిపాదనలను సీఆర్డీఏ అథార్టీ సమావేశం ఆమోదించింది.

యుద్ధ ప్రభావానికి
## విరుగుడు చర్యలు

- పౌల్ట్రీ, హార్టీకల్చర్ రంగాల్లో సంక్షోభం తలెత్తకుండా కార్యాచరణ
- గల్ఫ్‌లోని ప్రవాసాంధ్రుల క్షేమ సమాచారాలపై నిరంతర ఆరా
- ఉగాదికి 2.5 లక్షల సామూహిక గృహ ప్రవేశాలు
- సీసీ కెమెరా నెట్వర్క్ ద్వారా నేర నియంత్రణ ప్రణాళిక
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

- వివరాలు 2 లో..

ప్రభుత్వ పథకాలు,
## అభివృద్ధిపై కీలక సమీక్షలు

- నేడు, రేపు కలెక్టర్ల కాన్ఫరెన్స్
- దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు
- రెండో రోజున శాంతి భద్రతలపై రివ్యూ
- హాజరుకానున్న జిల్లాల ఎస్పీలు

3

- ఢిల్లీ చేరిన మంత్రి లోకేష్



బుధవారం ఢిల్లీలో మెటా ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వాట్సాప్ సిటిజన్ ఎంగేజ్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫోరమ్ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రి లోకేష్ ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో తనను కలిసిన ఎంపీలతో మంత్రి లోకేష్ కాసేపు ముచ్చటించారు.

## పుష్కరాలకు ముందే పోలవరం

- ఏపీ ఆధునిక దేవాలయం ఈ ప్రాజెక్టు
- నాణ్యత విషయంలో ఎటువంటి రాజీలేదు
- జూన్‌కల్లా కుడి, ఎడమ కాల్వలు
- జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు
- పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష

5



పోలవరం ప్రాజెక్ట్ ఏపీకి ఆధునిక దేవాలయం. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనమేరకు రాష్ట్రంలో చారిత్రక ఘట్టమైన గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పోలవరం పూర్తి చేయడంద్వారా ఇటు ఉత్తరాంధ్ర.. అటు రాయలసీమకు గోదావరి జలాలు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయబోతున్నాం. ఈ మహాయజ్ఞం ద్వారా రాష్ట్రాన్ని కరవురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం.

– జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

జగన్ ఆర్థిక విధ్వంసానికి
## కాగ్ నివేదికే సాక్ష్యం



- సొంత కంపెనీల కోసమే పనిచేశారు
- భారతి సిమెంట్‌కు అప్పనంగా లబ్ధి
- సాక్షికి వందల కోట్లు దోచిపెట్టారు
- నేడు సంక్షేమానికి స్వర్ణయుగంగా కూటమి ప్రభుత్వం
- గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి

6

## ఎల్పీజీ కొరత లేదు



- సరఫరాను పర్యవేక్షిస్తున్నాం
- గృహ వినియోగదారులకు ఇబ్బందులుండవు
- బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా నిఘా
- ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి నాదెండ్ల

9

## రైతు ద్రోహి జగన్‌రెడ్డి



పంటల బీమా చెల్లించకుండా మోసానికి పాల్పడిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు రైతుల బాగుకోసమంటూ దొంగ ఏడ్పుల డ్రామాకు తెరలేపడం విడ్డూరం. గత ప్రభుత్వ పాలనలో అన్నదాతను నట్టేట ముంచారు. మద్దతు ధరలోనూ మోసాలకు పాల్పడ్డారు. ధాన్యం చెల్లింపులు బకాయిలుపెట్టి వెళ్లిన చరిత్ర వాళ్లది. నేడు మద్దతు ధర లేదంటూ దుష్ప్రచారాలకు తెగపడటం.. దెయ్యాలు వేదాలు వల్లించడమే. అన్నదాతల సంక్షేమంలో కూటమి ప్రభుత్వం రాజీపడదు. ఎరువులు, యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. పెండింగ్ పరిహారం నిధులనూ విడుదల చేశాం. ఇన్‌పుట్ సబ్సిడీ పెంపు, పంటల బీమా సంస్కరణలు, మద్దతు ధర అమలు.. ధరల స్థిరీకరణకు చర్యలు. అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. రైతును రాజు చేయడమే కూటమి లక్ష్యం.

– సేద్యం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

4






## సౌదీ నుంచి క్షేమంగా బయలుదేరిన 59 మంది తెలుగు పౌరులు

మంత్రి లోకేష్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఏపీఎన్ఆర్టీ, ఎన్ఆర్ఐ టిడిపి నాయకులు

ప్రవాసాంధ్ర పేజీలో..

# యుద్ధ ప్రభావానికి విరుగుడు చర్యలు

- పాల్ట్రీ, హార్టీకల్చర్ రంగాల్లో సంక్షోభం తలెత్తకుండా కార్యాచరణ
- గల్ఫ్‌లోని ప్రవాసాంధ్రుల క్షేమ సమాచారాలపై నిరంతర ఆరా
- ఉగాదికి 2.5 లక్షల సామూహిక గృహ ప్రవేశాలు
- సీసీ కెమెరా నెట్వర్క్ ద్వారా నేర నియంత్రణ ప్రణాళిక
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష




అమరావతి (చైతన్య రథం): ఇరాన్ యుద్ధ ప్రభావంపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తగిన నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గల్ఫ్ దేశాలతో ఉన్న అన్ని అంశాలూ ప్రభావితమయ్యే అవకాశం ఉంటుందని, వాటివల్ల సంక్షోభం తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మంగళవారం వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్పీజీ, గుడ్లు, అరటి వంటి వాటి ఎలాంటి ప్రభావం ఉందోననే అంశంపై నిరంతరం పరిశీలించాలని సీఎం సూచించారు. యుద్ధ ప్రభావిత దేశాలతోపాటు ఇతర ప్రాంతాల్లో తెలుగువారున్న చోట పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. విదేశాంగ వ్యవహారాల శాఖతో సంప్రదించి ప్రవాసాంధ్రుల క్షేమంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంతోపాటు ఉన్నతాధికారులు ఓ బృందంగా ఏర్పడి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. అంతకుముందు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థలు అందిస్తున్న పౌర సేవలు, విద్యుత్ సరఫరా, పాఠశాల, ఉన్నత విద్య, ఇసుక సరఫరాలాంటి అంశాలపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత ఏడాదిలో విద్యుత్ వినియోగం గరిష్టంగా 14,013 మెగావాట్లకు చేరుకుందని అధికారులు వివరించారు. విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎనర్జీ ఆడిట్ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి డిస్కంలను ఆదేశించారు. ఈ విషయంలో వినియోగదారులకు పూర్తి సమాచారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిస్కంలకు సూచించారు. అటు పాఠశాల, కళాశాల విద్యకు సంబంధించిన అంశాల్లో సిలబస్, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రమైన తరగతి గదులువంటి అంశాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తృణ ధాన్యాలతో చిక్కీలాంటి పౌష్టికాహారం అందించే అంశాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

## డీజీసీఏ సహకారంతో డ్రోన్ పైలట్ ట్రైనింగ్ సెంటర్

ఉగాది రోజున 2.5 లక్షలమంది లబ్ధిదారుల సామూహిక నూతన గృహ ప్రవేశ కార్యక్రమం చేపడుతున్నామని, వారికి ప్రభుత్వం తరపునుంచి స్థానిక ప్రజాప్రతినిధులు అందించేలా అధికారిక లేఖ వెళ్లేలా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఇసుక సరఫరా జరగాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సీఎం సూచించారు. ఇటీవల ఢిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ ఇండియా సమ్మిట్లో కుదుర్చుకున్న ఒప్పందాలు సాకారమయ్యేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు భారత్ జెన్, నెక్స్ జెన్, ఐబీఎంలాంటి సంస్థలు ముందుకొచ్చాయని, వచ్చే విద్యా సంవత్సరంనుంచే కోర్సులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అటు కాలిబో సంస్థ ఏర్పాటు చేయదలచిన ఏఐ శాండ్ బాక్స్ వచ్చే నాలుగు నెలల్లో స్టార్టప్‌ల కోసం అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఎన్విడియా సంస్థ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో భాగసామ్యం వహించేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ రైతుకూ సహకారం అందించేలా ఏఐ అగ్రానమిస్ట్, విద్యా బోధనకు సహకారం అందించేలా ఏఐ ట్యూటర్, ప్రాథమికంగా వైద్య సలహాలు అందించేలా ఏఐ డాక్టర్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పేషెంట్ ప్రిస్క్రిప్షన్ కూడా యాప్ ద్వారా వచ్చేలా చూడాలన్నారు. సీసీ టీవీ యాప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 14 వేల సీసీ కెమెరాలను అనుసంధానించి నేర నియంత్రణ చేపట్టేలా చూడాలన్నారు. నేరస్థులను గుర్తించి నేరాలకు అడ్డుకట్టే వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీని త్వరితగతిన అందుబాటులోకి తేవటంతోపాటు.. డ్రోన్ ఫ్లైయింగ్ ట్రాక్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రిమోట్ పైలట్ ట్రైనింగ్ సెంటర్ కూడా ఏర్పాటుచేసి శిక్షణ ఇవ్వాలన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సహకారంతో అత్యుత్తమ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏటీసీ తరహాలోనే డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థను రూపొందించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్సు వినియోగం మరింత పెంచేలా పౌరులకు శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం సూచించారు. సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయిప్రసాద్, ఐటీ, ఆర్టీజీఎస్, గనులు, విద్య, ఆర్థిక, ప్రణాళిక శాఖల అధికారులు హాజరయ్యారు.

# తెలుగు వైభవానికి అమరావతి ప్రతీక

- సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై దృష్టి సారించండి
- క్రీడలు, పర్యాటకానికి పెద్ద పీట వేసేలా ప్రణాళికలు
- పెట్టుబడులతో వచ్చే సంస్థలతో నిరంతర సంప్రదింపులు
- 59వ సీఆర్డీఏ అథారిటీ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- భూకేటాయింపులు సహా వివిధ ప్రతిపాదనలకు అథార్టీ ఆమోదం



అమరావతి (చైతన్య రథం): తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా... భావితరాలకు అందించేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజధానిలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. సమావేశంలో రాజధానిలోని వివిధ సంస్థలకు జరపాల్సిన భూకేటాయింపులు, సెక్రటేరియేట్, హెచ్‌వోడీ భవనాల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. సీఆర్డీఏనుంచి వచ్చిన వివిధ ప్రతిపాదనలను సీఆర్డీఏ అథార్టీ సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... 'రాజధాని పరిధిలోని నీరుకొండవద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి. మొత్తంగా 167 ఎకరాల విస్తీర్ణంలో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడంతోపాటు తెలుగు వైభవాన్ని చాటేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి. ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్ తదితర విభాగాలు వస్తాయి. పర్యాటకంతోపాటు నిత్యం రకరకాల కార్యక్రమాలు నిర్వహించుకునే వాతావరణాన్ని కల్పించాలి. హోటళ్లను ఏర్పాటు చేయడంతోపాటు, అమ్యూజ్‌మెంట్ పార్కులను అభివృద్ధి చేయాలి. అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా ఆ ప్రాంతాన్ని డిజైన్ చేయాలి. నీరుకొండలో చేపట్టేబోయే ప్రాజెక్టును అత్యంత సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలి. భవిష్యత్తులో క్రీడారంగం అతి పెద్ద ఆదాయ వనరు కానుంది. దీనికి బీసీసీఐ, ఐసీసీ సంస్థలే అతి పెద్ద ఉదాహరణ. ఒకప్పుడు నిధుల కోసం ఎదురు చూసే పరిస్థితినుంచి ఇప్పుడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా క్రికెట్ బోర్డులు ఎదిగాయి. ఇదేవిధంగా మరికొన్ని క్రీడలు కూడా కమర్షియలుగా రూపాంతరం చెందనున్నాయి. ఇలాంటివాటిని అందిపుచ్చుకోవాలి. అమరావతిలోని స్పోర్ట్స్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఇదేవిధంగా రూపొందించాం. అమరావతిలోకి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను తీసుకురావాలి. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇలాంటివారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్‌వంటి సంస్థలు ఇప్పుడు చింతిస్తున్నాయి. ఈసారి అమరావతిలో అలాంటి అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న క్రెడిబులిటీ. ఈ బ్రాండ్ మరింతగా పెరగాలి. అందుకే పెట్టుబడులు పెట్టే వారిని రెగ్యులరుగా ఫాలో అప్ చేస్తూనే ఉండాలి. ఓవైపు రాజధానిలో పనులను త్వరితగతిన చేపట్టేలా పర్యవేక్షణ చేస్తూనే.. పెట్టుబడులు పెట్టే సంస్థలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. అమరావతిలో నిర్మించనున్న తెలుగు కల్చరల్ సెంటర్‌కు మంచి పేరు పరిశీలించండి. రాజధానిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయండి. ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మించాల్సిన అవసరం ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ సాయిప్రసాద్, పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు.

## సీఆర్డీఏ అథార్టీ ఆమోదం పొందిన అంశాలివే..:

- సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్ల భూమి కేటాయింపు.
- పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు కేటాయింపు.
- పంచాయితీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల కేటాయింపు.
- ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులకు రూ.2316 కోట్లకు పరిపాలనా అనుమతులు.
- రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం.

# ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా ఏపీ



- త్వరలో టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్
- వచ్చే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- గనుల శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు అధికారుల ప్రతిపాదన

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రాన్ని ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా అభివృద్ధి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. ఇందుకు రాష్ట్రంలో బీచ్ సాండ్‌వంటి మినరల్స్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. సచివాలయంలో మంగళవారం గనుల శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి ‘ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్’ రూపకల్పన, పెట్టుబడులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ మిషన్ ద్వారా భారీగా పెట్టుబడులు ఆకట్టుకోవడంతోపాటు వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం స్పష్టం చేశారు. ఇది రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతంగా నిలుస్తుందన్నారు. ఈ మిషన్ ద్వారా వచ్చే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు, 40,000 ఉద్యోగాల సాధనే లక్ష్యం కావాలన్నారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్రం, మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలు, వాల్యూ ఎడిషన్‌పైనా మరింత అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. వనరుల సద్వినియోగం చేసుకోవాలంటే వాటిపై అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలన్నారు.

### రాష్ట్రంలో విలువైన బీచ్ సాండ్ మినరల్స్

రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని, వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్‌వంటి ఖనిజాలున్నాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బీచ్ సాండ్ మినరల్స్ ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఔషధ పరిశ్రమ, ఏరోస్పేస్, రక్షణరంగం, శస్త్రచికిత్స, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ భాగాలవంటి కీలక పరిశ్రమలకు అవసరం అవుతాయని వివరించారు.

రాష్ట్రంలో లభిస్తున్న మినరల్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ఈ సందర్భంగా ప్రతిపాదనలు ముఖ్యమంత్రి ముందుంచారు. అందులో ఒకటి శ్రీకాకుళంలో టైటానియం పార్క్, ఏడాది 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం. రెండవది అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్, ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం. మూడవది మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్. సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర, మైనింగ్, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై కీలక సమీక్షలు

**నేడు, రేపు కలెక్టర్ల కాన్ఫరెన్స్ ◆ దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోన్న అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేసేలా నేడు, రేపు రెండు రోజులపాటు కలెక్టర్ల సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరగనుంది. సమావేశంలో ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, జీఎస్డీపీ గ్రోత్, స్వర్ణాంధ్ర-2047విజన్ లక్ష్యాలు, మౌలిక సదుపాయాల కల్పన, శాంతిభద్రతలపై సమగ్రంగా చర్చించనున్నారు. కాన్ఫరెన్స్ మొదటిరోజు ఉదయం 10 గంటలకు సీసీఎల్ఏ స్వాగత ప్రసంగంతో ప్రారంభమవుతుంది. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ మంత్రి, ఆర్థిక మంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఉదయం 10:30గంటలకు ముఖ్యమంత్రి కీనోట్ అడ్రస్ ఇవ్వనున్నారు. అనంతరం వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించనున్నారు. స్వర్ణాంధ్ర-2047.. పది సూత్రాల అమల్లో భాగంగా పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, జల భద్రత, వ్యవసాయరంగంలో టెక్నాలజీవంటి అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్ర జీఎస్డీపీ, జిల్లాలవారీగా సాధించిన లక్ష్యాలపై సమీక్షిస్తారు. ఇక డిజిటల్ గవర్నెన్సులో భాగంగా ఈ-ఆఫీస్ ఫైళ్ల పరిష్కారం, డేటా డ్రివెన్ గవర్నెన్స్, పెట్టుబడి ప్రతిపాదనల గ్రౌండింగ్‌పై అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేయనున్నారు. సదస్సు రెండో రోజున ప్రజారోగ్యం, సంక్షేమ పథకాలపై ప్రత్యేక సమావేశంలో కీలక చర్చ జరగనుంది. దీంతో సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు, మధ్యాహ్న భోజన పథకం, వేసవిలో తాగునీటి ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్ష చేపడతారు. అలాగే భూపరిపాలన, రెవెన్యూ ఆర్జనశాఖల పనితీరుతోపాటు విద్య,ఉపాధి అవకాశాల కల్పనపై చర్చలు జరగనున్నాయి. రెండోరోజు సాయంత్రంవేళ రాష్ట్రంలోని శాంతిభద్రతలపై ప్రత్యేక సెషన్ ఉంటుంది. ఈ సెషనులో జిల్లా ఎస్పీలు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితిపై డీజీపీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ రెండు రోజుల సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, హెచ్‌వోడీలు పాల్గొననున్నారు.

## 16న ‘స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్’ ఆవిష్కరణ

**మంత్రి లోకేష్‌కు ఆహ్వానపత్రం అందించిన ట్రస్ట్**

మంగళగిరి (చైతన్య రథం): రాజధాని అమరావతిలోని శాఖమూరులో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 58 అడుగుల భారీ కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవానికి విశిష్ట అతిథిగా రావాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. ఉండవల్లి నివాసంలో మంత్రిని కలిసిన ట్రస్ట్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ ట్రస్టీ, ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, ట్రస్ట్ ప్రతినిధులు ఈమేరకు ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. నారా లోకేష్ చేతుల మీదుగా సెప్టెంబర్ 3, 2025న శంకుస్థాపన జరిగిన ఈ ప్రాజెక్టును, కేవలం ఆరు నెలల కాలంలోనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం విశేషం. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంత్యుత్సవాల సందర్భంగా, ఆయన చేసిన 58 రోజుల ఆమరణ నిరాహారదీక్షకు గుర్తుగా 58 అడుగుల భారీ ‘స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్’ను నిర్మించారు. అమరావతి పెదపరిమి రోడ్డులోని తుళ్లూరు శాఖమూరు పార్క్‌లో నెలకొల్పిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని మార్చి 16న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవిష్కరించనున్నారు.


# సీఎంతో జనగణన డైరెక్టర్ భేటీ

- మే 1నుంచి హౌస్ లిస్టింగ్ హౌసింగ్ సెన్సస్ ప్రక్రియ
- వచ్చే నెల 15 నుంచి స్వీయగణన కార్యక్రమం
- రెండు దశలుగా 2027 జనగణన
- కార్యక్రమం గురించి సీఎంకి వివరణ



అమరావతి (చైతన్య రథం): 2027 జనగణనలో భాగంగా రాష్ట్రంలో ఈ ఏడాది మే 1నుంచి హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సస్ ప్రక్రియ చేపడుతున్నట్టు ఏపీ సెన్సస్ ఆపరేషన్స్, సిటిజన్ రిజిస్ట్రేషన్స్ డైరెక్టర్ జె నివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంతో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జనాభా లెక్కల ప్రక్రియను రెండు దశలుగా చేపడుతున్నామని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహగణన ప్రక్రియను చేపట్టనున్నట్టు నివాస్ వివరించారు.మే 30వరకూ జరిగే ఈ ప్రక్రియలో ఇళ్లలోని పరిస్థితులు, గృహాల్లోని వివిధ సదుపాయాలను, ఆస్తులకు సంబంధించిన వివరాలను నమోదు చేయనున్నట్టు తెలిపారు. రెండోదశలో భాగంగా 2027 ఫిబ్రవరి నుంచి జనాభా లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. జనగణనలో భాగంగా సామాజిక ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు, వలసలు, సంతానానికి సంబంధించిన వివరాలను నమోదు చేయనున్నట్టు తెలిపారు. పూర్తిగా డిజిటల్ విధానంలో తొలిసారి 16వ సెన్సస్ చేపడుతున్నట్టు వివరించారు. ఇంటర్నెట్ కనెక్షన్‌లేని ప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లోనూ సమాచార సేకరణ, జనగణన చేపట్టనున్నట్టు తెలియచేశారు. ప్రజలే నేరుగా తమ వివరాలను స్వీయగణన ద్వారా నమోదు చేసేందుకు పబ్లిక్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్టు ముఖ్యమంత్రికి వివరించారు. దీనికోసం సెన్సస్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా నిరంతరం జనగణన ప్రక్రియను పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ కోసం డిజిటల్ సరిహద్దు మ్యాపింగ్ చేయనున్నట్టు వివరించారు. వివరాల నమోదుకు 16 భాషల్లో హౌస్ లిస్టింగ్ మొబైల్ యాప్ అందుబాటులోకి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని ముఖ్యమంత్రికి తెలియచేశారు. 2027 జనగణన ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ప్రగతి, వికాస్ అనే మస్కట్‌లను వినియోగిస్తున్నట్టు రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్ డైరెక్టర్ నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు.

## పాఠశాలల అభివృద్ధికి ‘అమరా బచ్చు’ చేయూత



- మంత్రి లోకేష్‌ను కలిసిన ట్రస్టీ బచ్చు కృష్ణకుమార్ దంపతులు
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.5 కోట్లు సాయం ప్రకటన

ఉండవల్లి (చైతన్య రథం): పేదల సాధికారతకు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పీ-4 కార్యక్రమానికి నెల్లూరు జిల్లా బోగోలుకు చెందిన అమరా ఛారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించనుంది. ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బచ్చు కృష్ణకుమార్ దంపతులు.. బోగోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.5 కోట్ల సాయం ప్రకటించారు. త్వరలో చేపట్టనున్న ఆయా అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా మన బడి-మన భవిష్యత్ కింద బోగోలు మండలంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపర్చనున్నారు. మన బడి- మన భవిష్యత్తు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రవాస భారతీయులు, పూర్వవిద్యార్థులను భాగస్వాములు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోంది. దాతల పేర్లు కూడా ఆయా పాఠశాలలకు పెట్టుకునే అవకాశం కల్పించనుంది. త్వరలోనే మన బడి -మన భవిష్యత్తు వెబ్‌సైట్‌ను ప్రారంభించనుంది. మరోవైపు బోగోలు మండలం కొవ్వూరుపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రూ.5 కోట్లు, కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.5 కోట్ల సాయాన్ని అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ అందించనుంది.

# రైతు ద్రోహి జగన్‌రెడ్డి

- పంటల బీమా చెల్లించకుండా మోసం
- గత ప్రభుత్వంలో నట్టేటా ముంచారు
- మద్దతు ధర అమలు చేయకుండా అన్యాయం
- ధాన్యం బకాయిలు పెట్టి వెళ్లిన చరిత్ర వారిది
- నేడు మద్దతు ధర లేదంటూ దుష్ప్రచారం
- అన్నదాతల సంక్షేమంలో రాజీ లేదు
- ఎరువులు, యూరియా కొరత లేకుండా చర్యలు
- పెండింగ్ పరిహారం నిధులను విడుదల చేశాం
- ఇన్‌పుట్ సబ్సిడీ పెంపు, పంటల బీమా సంస్కరణలు
- మద్దతు ధర అమలు.. ధరల స్థిరీకరణకు చర్యలు
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర దక్కడం లేదంటూ వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారంపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయు డు తీవ్రంగా మండిపడ్డారు. రైతు సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పటికీ రాజీపడదని, అన్నదాతల అభ్యున్నతే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎరువుల సరఫరా పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని పేర్కొన్నారు. అయినప్పటికీ వైసీపీ నేతలు కావాలనే ప్రభుత్వంపై బురద చల్లడమే తమ ప్రధాన పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. తప్పుడు కథనాలతో ప్రజల ను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని నీలిమీడి యాకు హితవుపలికారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రైతులు అప్పులపాలై తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ధ్వజమెత్తారు.

### సమర్థవంతంగా యూరియా, ఎరువుల సరఫరా

రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియా, ఎరువుల సరఫరాను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఖరీఫ్ 2025 సీజన్‌కు అవసరమైన 6.22 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకు ముందుగానే ప్రణాళిక రూపొందించి 8.70 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఇందులో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల అమ్మకాలు జరిగాయని, సుమారు లక్ష మెట్రిక్ టన్నుల నిల్వతో ఖరీఫ్ సీజన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. రబీ 2025-26 సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం 9.38 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటా యించిందని చెప్పారు. ఫలితంగా ఇప్పటివరకు 10.20 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రంలో అందుబాటులో ఉంచి ఫిబ్రవరి నెలాఖరుకే రైతుల అవసరాలను పూర్తిగా తీర్చామని తెలిపారు. గత రబీతో పోల్చితే వరి, మొక్కజొన్న సాగు సుమారు 5 లక్షల హెక్టార్లలో పెరిగినా ఎక్కడా యూరియా కొరత తలెత్తలే దని తెలిపారు. అదేవిధంగా ఎరువుల బఫర్ స్టాక్ నిర్వహణకు ప్రతి సంవత్సరం కేటాయించే రూ.40 కోట్లకు అదనంగా 2025-26 సంవత్సరానికి మరో రూ.45 కోట్లు కేటాయించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8,489 రైతు సేవా కేంద్రాల నిర్వహణకు 2026-27 సంవత్సరానికి రూ.15.67 కోట్లు కేటా యించామని చెప్పారు. ప్రస్తుతం సుమారు 70 శాతం యూరి యాను రైతు సేవా కేంద్రాల ద్వారానే రైతులకు సరఫరా చేస్తున్నా మని వివరించారు.

### అన్నదాత సుఖీభవతో రైతులకు రూ.20 వేలు

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సూపర్‌సిక్స్‌లో భాగం గా అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తున్నా మని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో రైతు భరోసా పేరుతో రాష్ట్రం రూ.13,500 ఇస్తామని ప్రకటించినప్పటికీ రాష్ట్రం నుంచి కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చి, కేంద్రం ఇచ్చిన రూ.6,000ను కలిపి మొత్తం రాష్ట్రం ఇచ్చినట్లుగా ప్రకటించారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం కింద అర్హత కలిగిన వెబ్‌ల్యాండ్ భూ యజమానులు, అటవీ భూమి సాగుదారులకు సంవత్సరానికి రూ.20,000 మూడు విడతలుగా అందిస్తున్నామని తెలిపారు. ఇందులో రాష్ట్రం నుంచి రూ.14,000, కేంద్రం నుంచి పీఎం కిసాన్ ద్వారా రూ.6,000 అందుతున్నాయని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలుకు రూ. 6,300 కోట్లు కేటాయించామని, ఇప్పటికే రెండు విడతలుగా మొత్తం రూ.6,309.44 కోట్లు రైతు కుటుంబాలకు పంపిణీ చేశామని మంత్రి వివరించారు.

### పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. వరి పంటకు ఇన్‌పుట్ సబ్సిడీని రూ.17,000 నుంచి రూ.25,000కు పెంచా మని చెప్పారు. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు సుమారు 2 లక్షల మంది రైతులకు రూ.310 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అందించామని వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో ఆత్మహత్యలు చేసుకున్న 81 మంది రైతుల కుటుంబాలకు చెల్లించకుండా మిగిలిపోయిన రూ.5.67 కోట్ల నష్టపరిహారాన్ని కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అదేవిధంగా మరో 214 మంది రైతుల కుటుంబాలకు రూ.14.98 కోట్ల నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉద్యాన వన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు కూడా రూ.50 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అందించామని చెప్పారు. అదేవిధంగా గతంలో సాంకేతిక కారణాలతో మిగిలిపోయిన 1.21 లక్షల మంది రైతులకు రూ.147.34 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాధి వలన నష్టపోయిన 81 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ. 7,23,825 ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు.

### పంటల బీమా పథకంలో సంస్కరణలు

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం సమగ్రంగా పునఃసమీక్షించిందని మంత్రి తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాల మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి పథకం అమలుపై విశ్లేషణ చేసి కీలక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఖరీఫ్ 2024 సీజన్‌కు ఈ-క్రాప్ నమోదు ఆధారంగా ఉచిత పంటల బీమా అమలు చేశామని తెలిపారు. అనంతరం రైతు కూడా బాధ్యతా యుత భాగస్వామిగా ఉండేలా రబీ 2024-25 నుంచి స్వచ్ఛంద నమోదు విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో మూడు సీజన్లకు సంబంధించిన రూ.1,990.06 కోట్ల ఆర్థిక భారం ప్రస్తుత ప్రభుత్వంపై పడిందని ఆయన వెల్లడించారు. అయినప్పటికీ రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఖరీఫ్ 2024, రబీ 2024-25, ఖరీఫ్ 2025 సీజన్లకు సంబంధించిన బీమా క్లెయిమ్‌ల పరిష్కారం కొనసాగుతోందని చెప్పారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి పంటల బీమా పథ కం అమలుకు రూ.250 కోట్లు ప్రతిపాదించినట్లు తెలిపారు.

### ధరల స్థిరీకరణకు ప్రభుత్వ కట్టుబడి ఉంది

వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ధరల స్థిరీకరణ నిధి (పీఎస్‌ఎఫ్) కింద రైతులకు మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు వెంటనే ఆదుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం రూ.300 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే సుమారు రూ.588 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. పొగాకు పంటకు రూ. 240 కోట్లు, మామిడి పంటకు రూ.190 కోట్లు, ఉల్లి కొను గోలుకు రూ.17.20 కోట్లు, ఉల్లి నష్టపరిహారంగా రూ.128. 33 కోట్లు, కోకో పంటకు రూ.12 కోట్లు వెచ్చించి రైతులకు మద్దతు అందించామని తెలిపారు. మిర్చి ధరలు పతనమైన సందర్భంలో రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రయత్నాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) కింద ఒక క్వింటాకు రూ. 11,781.25 ఎంఐపీ ధర నిర్ణయించిందన్నారు. గతంలో 2017లో మిర్చి ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం సుమారు రూ.130 కోట్లు వెచ్చించి 55 వేల మంది రైతులకు క్వింటాకు రూ.1500 చొప్పున చెల్లించిందని మంత్రి తెలిపారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో 2020లో మార్కెట్ ధర రూ. 12,000 ఉన్నప్పటికీ కేవలం రూ.7,000 మద్దతు ధర ప్రకటించి అమలు చేయడానికి నిధులు కూడా మంజూరు చేయ లేదని విమర్శించారు. 2019-24 మధ్య రూ.2,140 కోట్ల బడ్జెట్ కేటాయించి కేవలం రూ.1,475 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రూ.7,700 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం చేశారని మంత్రి విమర్శించారు.

### ఉల్లి రైతులను ఆదుకున్నాం..వైసీపీ దగా చేసింది

కడప, కర్నూలు జిల్లాల్లో ఉల్లి రైతుల నుంచి ఉల్లి కొనుగో లుకు రూ.17.56 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. అలాగే ఉల్లి పంట నష్టపరిహారాన్ని హెక్టారుకు రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెంచి రైతులకు రూ.128.33 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వం క్వింటాకు రూ.770 ఎంఎస్‌పీ ప్రకటించి కేవలం 129 మంది రైతుల నుంచి 972 మెట్రిక్ టన్నుల ఉల్లి మాత్రమే కొనుగోలు చేసి బాధ్యత తప్పించుకుందని మండిపడ్డారు.

### ధాన్యం బకాయిలు కూటమి వచ్చాక చెల్లించాం

2024-25లో కొబ్బరికి గత 10 సంవత్సరాల్లో అల్‌టైం రికార్డు ధర లభించడంతో రైతులు లాభపడ్డారని తెలిపారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వ కాలంలో రైతులు ధాన్యం అమ్మిన తర్వాత డబ్బుల కోసం 54 రోజుల వరకు వేచి చూడాల్సి వచ్చేదన్నారు. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించిన రూ.1,674 కోట్లు రైతులకు చెల్లించకుండా మిగిలి పోయాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బకాయిలన్నీ చెల్లించిందన్నారు. 2024-25 ఖరీఫ్, రబీ సీజన్లలో మొత్తం రూ.13,858 కోట్లు ధాన్యం కొనుగోలు సొమ్మును రైతులకు చెల్లించామని చెప్పారు. 2025-26 సీజన్‌లో 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. గత 20 నెలల్లో ఏ పంట ధర తగ్గినా రైతులు నష్టపోకూడదనే లక్ష్యంతో ధరల స్థిరీకరణ నిధి ద్వారా రూ.588 కోట్లు ఖర్చు చేసి సుమారు లక్ష మంది రైతులను ఆదుకున్నామని తెలిపారు. 2026-27 సంవత్సరానికి ధరల స్థిరీకరణ నిధి కింద రూ.500 కోట్లు కేటాయించామని, అవసరమైతే ఇంకా నిధులు వెచ్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అదేవిధంగా 2026-27 సంవత్సరా నికి మార్కెటింగ్ శాఖకు రూ.515.39 కోట్ల బడ్జెట్ ప్రతిపాదిం చినట్లు తెలిపారు.

# పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి

- ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ఆధునిక దేవాలయం
- నాణ్యత విషయంలో ఎటువంటి రాజీలేదు
- నెలాఖరుకు డయాఫ్రం వాల్ సిద్ధం
- జూన్ కల్లా కుడి, ఎడమ కాలువలు
- జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు
- పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష




ఏలూరు(చైతన్యరథం): పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆధునిక దేవాలయం అని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు రాష్ట్రంలో చారిత్రక ఘట్టమైన గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ప్రాజెక్టు పనులను, ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్ నిపుణులు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం పూర్తి చేయడం ద్వారా ఇటు ఉత్తరాంధ్ర అటు రాయలసీమకు గోదావరి జలాలు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయబోతు న్నామని చెప్పారు. ఈ మహా యజ్ఞం ద్వారా రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ మని వివరించారు. అలాగే పోలవరం సహా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నామని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించి పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని తెలిపారు. గత ప్రభుత్వంలో కీలకమైన డయాఫ్రం వాల్ ధ్వంసం అయింది. దాన్ని సరి చేస్తే సరిపోతుందని నిపుణులు చెప్పినా నాణ్యత, ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టామని స్పష్టం చేశారు. సీడబ్ల్యూసీ డిజైన్స్ ప్రకారమే పోలవరం పనులు జరుగుతున్నాయని వివరించారు. అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనలు, ప్రమా ణాలు పాటిస్తూ పనులు చేస్తున్నామన్నారు. ఈ పనులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిత్యం పర్యవేక్షిస్తుందని చెప్పారు. అలాగే ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు కేంద్రానికి తెలియజేస్తున్నట్లు చెప్పారు. కొత్త డయాఫ్రం వాల్ 1372 మీటర్లకు గానూ 1300 మీటర్లు నేటికి పూర్తయిందన్నారు. ఈ నెలాఖ రుకు మొత్తం పూర్తవుతుందన్నారు. ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతంలో నేలను గట్టిపరచేలా వైబ్రో కాంప్యాక్షన్ పనులు పూర్తి చేశామని చెప్పారు. ప్రాజెక్ట్ అనుసంధాన పనుల్లో ముఖ్యమైన కుడి, ఎడమ కాలువలను ఈ ఏడాది జూన్ కల్లా పూర్తి చేస్తామని చెప్పారు.

**నిర్వాసితులకు అండగా నిలిచాం**

నిర్వాసితుల నష్టపరిహారానికి సంబంధించి నాడు 2016లో రూ.700 కోట్ల పరిహారం అందించిన ఘనత చంద్రబాబుదే అని పేర్కొన్నారు. మరలా కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు దఫాలుగా రూ.1900 కోట్లు పంపిణీ చేసి నిర్వాసితులకు అండగా నిలిచారన్నారు. నిర్వాసితులను కొంత మంది మధ్యవర్తులు మీకు మావల్లే పరిహారం అందిందంటూ మోసం చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చిందని, మధ్యవర్తుల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. నిర్వాసితులు కూడా ఇలా మోసానికి పాల్పడే వారిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రాజెక్ట్ నిర్మాణంపై సూచనలను మనస్ఫూర్తిగా స్వీకరిస్తామని చెప్పారు. ఆయన వెంట జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ప్రాజెక్ట్ అడ్మిన్ అభిషేక్, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ప్రాజెక్ట్ అధికా రులు పాల్గొన్నారు.



టీడీపీ కేంద్ర కార్యాలయంలో

## నేటి నుంచి ప్రజావేదిక షెడ్యూల్

మంగళగిరి (చైతన్యరథం): ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఆదేశానుసారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ప్రతిరోజూ ప్రజా వేదిక కార్యక్ర మం జరుగుతుంది. మంత్రులు, పార్టీ నాయకులు ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తారు. ప్రతి శుక్రవారం ప్రతి నియోజక వర్గంలో సంబం ధిత శాసనసభ్యుల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించబడుతున్నందున పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ రోజుల్లో ఎటువంటి గ్రీవెన్స్ జరగదు. ఆదివారం గ్రీవెన్స్ ఉండదు. బుధవారం నుంచి ప్రజావేదికలో పాల్గొనే మంత్రులు, నాయకుల షెడ్యూల్‌ను పార్టీ కార్యాలయం వెల్లడించింది.

***నేటి నుంచి ప్రజావేదిక షెడ్యూల్***

- 11.03.2026–ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏపీ వ్యవసాయ కమిషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి
- 12.03.2026– మాజీ మంత్రి దేవినేని ఉమామ హేశ్వరరావు, ఏపీ బిల్డింగ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు
- 14.03.2026 – మంత్రి పయ్యావుల కేశవ్, పార్టీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు
- 16.03.2026 – మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్
- 17.03.2026 – మంత్రి వంగలపూడి అనిత, ఏపీఈ డబ్ల్యుఐడీసీ చైర్మన్ ఎస్.రాజశేఖర్
- 18.03.2023 – మంత్రి పొంగూరు నారాయణ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

# పమిడిపాడులో శనగల కొనుగోలు కేంద్రం

***ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్***

**- 271 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ**

**- రూ.3 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు**




అద్దంకి(చైతన్యరథం): నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతోంది. మంగళవారం కొరిశపాడు మండలంలోని పమిడిపాడు, దైవాల రావూరు ఉన్నత పాఠశాలలకు చెందిన 271 మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా పమిడిపాడు ఉన్నత పాఠ శాలలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే భగీరథ కెమికల్స్ సహకారంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో తాగునీటి ప్లాంట్‌ను రిబ్బను కట్ చేసి ప్రారంభిం చారు. అదే గ్రామంలో 16 మంది చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. పమిడిపాడులో సుమారు రూ.3 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి రవికు మార్ తెలిపారు. దాతల సహకారంతో అందిస్తున్న ఈ సైకిళ్లు విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపా రు. ఏప్రిల్ 16 నాటికి నియోజకవర్గంలోని అన్ని అర్హులైన విద్యా ర్థులకు సైకిళ్ల పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల కోసం సాయంత్రం ప్రత్యేక ట్యూషన్ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో విద్యా వ్యవస్థ దెబ్బతిన్నదని మంత్రి విమర్శించారు. నాడు–నేడు పేరుతో అప్పటి నాయకులు ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు సమానంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో భగీరథ ఇండస్ట్రీస్ సహకారంతో రక్షిత తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్న ట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యా ర్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలోనే మైనార్టీలకు మేలు

**నైపుణ్య శిక్షణతో అభివృద్ధిలోకి రావాలి**

**వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలి**

**న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్**

**ఉర్దూ వర్సిటీ పనుల పూర్తికి చర్యలు: టీజీ భరత్**



కర్నూలు(చైతన్యరథం): వృత్తి నైపుణ్యాన్ని సద్వినియోగం చేసు కుని అభివృద్ధి చెందాలని న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. కర్నూలు ఉస్మానియా కాలేజీ సమీపం లోని టీజీ వెంకటేష్ షాదీఖానా హాలులో మంగళవారం కుట్టు మిషన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలని, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందాలని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.

మఖాన్ – దుకాణ్ స్కీమ్ తీసుకుని వచ్చాం, కర్నూలుకు ఉర్దూ అకాడమీని తీసుకువచ్చాం. ముత్త వల్లిలకు, మౌజన్లకు గౌరవ వేతనం ఇస్తున్నా మని తెలిపారు. గతంలో కార్పొ రేషన్ ద్వారా లక్షల్లో లోన్లు ఇప్పిం చాం. గత ఐదేళ్లూ మాత్రం ఏమీ జరగలేదని తెలిపారు. ఇప్పుడు మళ్లీ కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పించే చర్యలు తీసుకుం టామని తెలిపారు. నైపుణ శిక్షణను మెరుగుపరుచుకుని అభివృద్ధిలోకి రావాలని తెలిపారు. కార్పోరేషన్ అందిస్తున్న 141 కుట్టు మిషన్ల తో మీ కుటుంబాలను వృద్ధిలోకి తీసుకురావాలని, కొత్తగా ఆలో చించి నైపుణ్యం పెంచుకుని మంచి పనులు చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని మహిళలను కోరారు.

**ఉర్దూ యూనివర్సిటీ పనులు పూర్తికి చర్యలు: టీజీ భరత్**

మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వక్ఫ్ కమిటీ ఏర్పాటు చేయకుండా ఉండిపోయారని, దానివల్ల ముస్లిం మైనారిటీలకు నష్టం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ఉషా కంపెనీ బ్రాండెడ్ కుట్టు మిషన్ల పంపిణీ వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ పనులు పూర్తి చేయటానికి అన్ని చర్యలు తీసు కుంటున్నామని, మా సొంత నిధులు కేటాయించి కూడా పనులు చేస్తున్నామని, కర్నూలు ఎగ్జిబిషన్ సొసైట, కిడ్స్ వరల్డ్ పార్క్ ద్వారా వచ్చే దాదాపు రూ.50 లక్షల ఆదాయాన్ని ముస్లిం మైనారిటీల కోసం ఖర్చు చేస్తున్నామని వివరించారు. స్థానిక బుధవారిపేటలోని దాదాపు 5 ఎకరాల స్థలాన్ని ఎంఎస్ఎంఈకి కేటాయించి నట్లయితే అక్కడ చిన్నచిన్న పరిశ్రమలు నెలకొల్పి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించగలమని మంత్రి ఫరూక్‌ను కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండీ ఏ.శేఖర్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహ పర్వీన్, హజ్ కమిటీ మెంబర్ మన్సూర్ అలీఖాన్, మైనారిటీ నాయకులు మహ మ్మద్ ఖాన్, మహబూబ్ ఖాన్, జియావుల్ హక్, జుబేర్, సల్మాన్, ఇమ్రాన్, ఇన్‌చార్జులు వెంకటేష్, శుక్రన్‌లు పాల్గొన్నారు.

చైతన్యరథం

# జగన్ ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం

- సొంత కంపెనీల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశారు
- భారతి సిమెంట్‌కు అప్పనంగా లబ్ధి చేకూర్చారు
- ప్రకటనలతో సాక్షికి వందల కోట్లు దోచిపెట్టారు
- అప్పటి అప్పులతో నేడు ఏటా రూ.71,800 కోట్ల భారం
- నేడు సంక్షేమానికి స్వర్ణయుగంగా కూటమి ప్రభుత్వం
- గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి



మంగళగిరి(చైతన్యరథం): సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చ డమే పనిగా జగన్ ఐదేళ్ళు రాష్ట్రాన్ని పరిపాలిం చాడని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. సిమెంట్‌లో భారతి సిమెంట్‌కు.. ప్రకట నల ద్వారా సాక్షికి లబ్ధి చేకూర్చ డమే లక్ష్యంగా జగన్ పని చేశాడని ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాల యంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీ సిమెంట్‌కు లబ్ధి చేకూరే విధంగా సిమెంట్ ధర రూ.3 పెంచి సుమారు రూ.165 కోట్లు ప్రజలపై భారం వేశాడని మండి పడ్డారు. దీంతో భారతీ సిమెంట్ సామర్థ్యం మూడు రెట్లు పెరిగిం దన్నారు. జగన్ అసెంబ్లీకి రాకుండా ఇంట్లో ఉంటూ రాష్ట్ర ఆర్థిక రంగంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తా రు. రాజ్యాంగం కల్పించిన అన్ని అవకాశాలను జగన్ వదిలి వేసి.. ఇవాళ ప్రభుత్వంపై ఒకటే పనిగా బురద జల్లే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాయకత్వానికి ఇవాళ రాష్ట్ర ప్రజలు 164 సీట్లు అప్పగించారు. ఆ నమ్మకంతోనే కూటమి ప్రభు త్వం సమర్థవంతంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.

### వైసీపీ పాలనలో అప్పుల కుప్ప

వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో సుమారు 9.70 లక్షల కోట్లు అప్పు చేశారు. ఆ అప్పు కూటమి ప్రభుత్వం చేసినట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.81 వేల కోట్లు ప్రభుత్వం అప్పు తీసుకుందని కాగ్ నివేదిక ఇస్తే.. వైసీపీ రూ.87 వేల కోట్లుగా ప్రచారం చేస్తుంది. ఆ ఏడాదిలో వైసీపీ మూడేళ్లు అధికారంలో ఉంది. తొలి మూడు నెలల్లో రూ.27,025 కోట్లు అప్పు చేసింది. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లో రూ.53 వేల కోట్లు అప్పు చేసింది. జగన్ చేసిన ఆ అప్పులతో ఆస్తులు కూడా సమకూర్చలేదు. మా ప్రభుత్వం వచ్చిన తరువాత మూలధనం వ్యయంపై సుమారు రూ.16 వేల కోట్లు ఖర్చు పెట్టి ఆస్తులను సృష్టిస్తున్నాం. భవిష్యత్ తరాలకు అప్పులే కాకుండా ఆస్తులను సృష్టిస్తున్నాం. వైసీపీ బాధ్యత రహిత పరి పాలనతో బ్యాంకులు అప్పులు ఇవ్వడం మానేశాయి. పెట్టుబడులు దారులు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. అటువంటి పరిస్థితిలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాజీ పడటం లేదని తెలిపారు. తొలి ఏడాదిలో ప్రభుత్వ ఉద్యోగస్థులకు రూ.20 వేల కోట్లు చెల్లించాం. ప్రతీ నెల మొదటి తేదీకే జీతాలు చెల్లిస్తున్నామని వివరించారు.

### 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం

చంద్రబాబు నాయకత్వంతో పెట్టుబడిదారుల్లో, పారిశ్రామిక వేత్తల్లో రాష్ట్రంపై విశ్వసనీయత పెరిగింది. జగన్ హయాంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన కంపెనీలు కూడా నేడు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఎన్నికల హామీ ప్రకారం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నాం. 20 పాలసీలు తీసుకొచ్చి పారిశ్రామిక వేత్తలను ఆకర్షించాం. ఈ ఇరవై నెలల్లో సుమారు రూ.8 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చాం. కూటమి ప్రభుత్వంలో యువతకు ఒక భరోసా ఇస్తున్నాం. సుమారు 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు.

### గతంతో పోల్చితే సంక్షేమానికి 45 శాతం అధికం ఖర్చు

జగన్ హయంలో ఐదేళ్లలో అమ్మఒడి పథకానికి రూ.26 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. సామాజిక పింఛన్ల కోసం జగన్ రూ. 58,500 కోట్లు ఖర్చు చేస్తే.. కేవలం 20 నెలల్లోనే రూ.58,654 కోట్లు ఖర్చు చేశాం. రైతులకు జగన్ ఐదేళ్లలో రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తే.. ఒక్క సంవత్సరంలో రూ.6300 కోట్లు ఇచ్చాం. గతంతో పోల్చితే 45 శాతం వరకు అదనపు నిధులు ఇస్తున్నాం. కేంద్ర పథకాలైనా అమృత్, జల్‌జీవన్ మిషన్ పథకాలకు రాష్ట్రం నుంచి డబ్బులు ఇవ్వకుండా వాటిని వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఒక దిశానిర్దేశం లేని పథకాలను అమ లు చేసి ప్రజలను మోసం చేశాడు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, డొక్కా సీతమ్మ పథకం ద్వారా నాణ్యమైన రుచికరమైన భోజనం ఇస్తున్నామని తెలిపారు.

### జగన్ అప్పులకు వడ్డీలు..మళ్లీ అప్పులు చేస్తున్నాం

"పంచాయతీ గ్రాంట్స్, కేంద్ర ప్రభుత్వ పథకాలను జగన్ పక్కదారి పట్టించారు. జగన్ హయాంలో సర్పంచ్‌లు అధికారాలు తీసి ఇంట్లో కూర్చొబెట్టారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. ఇప్పుడు అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తు న్నాడు. జగన్ హయంలో రాష్ట్రానికి ఒక్క పెట్టుబడైనా వచ్చిందా? సాక్షి పత్రిక, టీవీలో నచ్చిన వారిని కూర్చొబెట్టి అసత్య వార్తలను ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు. చివరికి అన్నం పెట్టే రైతు లను మోసం చేసిన చరిత్ర జగన్‌రెడ్డిది. బాధ్యతారహితంగా వ్యవ హరించి రైతులకు రూ.1600 కోట్లు చెల్లించకుండా వెళ్లిపో యారు. వైసీపీ హయాంలో ధాన్యం అమ్మిన ఆరు నెలల వరకు డబ్బులు జమ అయ్యేవి కావు. నేడు 24 గంటల్లో రైతు అకౌంట్ లో డబ్బులు జమ చేస్తున్నాం. జగన్ ఐదేళ్లలో సుమారు రూ. 9.74 కోట్లు అప్పులు వారసత్వంగా ఇచ్చాడు. వాటి అసలు, వడ్డీ చెల్లించడానికే రూ.71,800 కోట్లు చెల్లించాల్సిన వస్తుంది. పోలవరం, అమరావతి ప్రాజెక్టును నాశనం చేశాడు. చింతల పూడి, వెలిగొండ ప్రాజెక్టులను పూర్తి చేస్తే లక్షల మంది రైతులు బాగుపడేవారని హితవుపలికారు.

### సొంత కంపెనీల సంక్షేమమే జగన్ లక్ష్యం

రాష్ట్రానికి ఆదాయం తీసుకొచ్చే మార్గాలను వదిలేసిన జగన్.. తన ఆదాయానికి ఏ మాత్రం డోకా లేకుండా చూసుకున్నారు. భారతీ సిమెంట్‌కు లబ్ధి చేకూర్చారు. సిమెంట్ ధర రూ.3 పెంచి రూ.165 కోట్లు ప్రజలపై భారం వేశారు. సుమారు భారతీ సిమెం ట్ సామర్థ్యం మూడు రెట్లు పెంచాడు. సాక్షికి పత్రికకు ప్రకటన రూపంలో రూ.400 కోట్లు దోచిపెట్టారు. ప్రత్యేక జీవోలు తీసుకొచ్చి వాలంటీర్స్, సచివాలయ సిబ్బందికి కేవలం సాక్షి పత్రికలు మాత్రమే సరఫరా చేశాడు. సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నామో.. ఆదాయ వనరులు కూడా అలానే తీసుకు రావాలి. అప్పుడే రాష్ట్ర ఆర్థిక రంగం గాడిలో పడుతుంది. ఐదేళ్లు బటన్ నొక్కడమే పనిగా జగన్ పని చేశాడు. ఆదాయ వనరులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు.

# సంక్షేమానికి స్వర్ణ యుగం



- కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం
- పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- 'సూపర్ సిక్స్'ను సూపర్ హిట్ చేశాం
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమానికి నిజమైన స్వర్ణ యుగం ప్రారంభమైందని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కొద్దిమందికే పరిమితమయ్యాయ ని, ప్రస్తుతం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ ప్రభుత్వం సంక్షేమాన్ని చేరవేస్తోందని తెలిపారు.

'జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో కేవలం 15శాతం హామీలను మాత్రమే అమలు చేసి మిగతా 85 శాతం హామీలను అమలు చేయకుండా అమలు చేసినట్లు ఊదరగొట్టుకున్నాడు. సంక్షేమం అంటే కేవలం బటన్ నొక్కుడు కార్యక్రమంగా తయారు చేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా రాష్ట్రంలో సుమారు 63లక్షల మందికి ప్రతినెలా రూ.2,700 కోట్లకు పైగా పెన్షన్లు అందిస్తున్నాము. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఈ పథకాన్ని అమలు చేస్తున్నాము' అని వివరించారు.

### సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాం:

'అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం హామీలను అమలు చేసి సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. దీపం-2 పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నాము. రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 'అన్నదాత సుఖీభవ' రాష్ట్ర చరిత్రలోనే అత్యంత పెద్ద సాయంగా నిలిచింది. ఈ పథకం ద్వారా సంవత్సరానికి రూ.20వేల ఆర్థిక సహాయం అందిస్తున్నాము. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.14 వేలు జమ చేశాము. దేశంలో రైతులకు ఇంత పెద్ద మొత్తంలో సాయం అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే' అన్నారు.

### విద్యా రంగంలో సంస్కరణలు:

రాష్ట్ర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యా రంగంలో విస్తృతమైన సంస్కరణలు తీసుకొస్తున్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో ఉన్న ప్రతి విద్యార్థికీ రూ.15వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తున్నాము. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విదాంమ రంగంలో పలు సంస్కరణలు అమలవుతున్నాయి. పాఠ్యపుస్తకాల సరళీకరణ, మెగా పేరెంట్-టీచర్ మీటింగ్స్, లీప్ మోడల్ విద్యా విధానం వంటి చర్యల ద్వారా గుణాత్మక విద్య అందిస్తున్నాము. కేంద్ర స్థాయి అధికారులు కూడా ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థను అభినందించడం గర్వకారణం. కులం, మతం, పార్టీ అనే భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్ పార్టనర్‌షిప్ (పీ4) విధానాన్ని అమలుచేస్తూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను సాధికారత దిశగా నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నాము. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు వ్యాపారవేత్తగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

### ముఖ్యమంత్రి సహాయ నిధి:

పేద కుటుంబాలు ఆరోగ్య సమస్యల కారణంగా ఆర్థికంగా కష్టాల్లో పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వందల కోట్ల రూపాయలు అందిస్తున్నాము. సంజీవని పథకం ద్వారా ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. గ్రామీణ పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి గతంలో ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థను మెరుగుపరుస్తూ స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులుగా అభివృద్ధి చేస్తున్నాము.

ఉద్యోగులకు వేతన స్కేలు, ప్రమోషన్ అవకాశాలు కల్పిస్తూ సేవల్లో నాణ్యతను పెంచుతున్నాము. కౌశలం కార్యక్రమం ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్-2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్నాము. స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులను అభివృద్ధి కేంద్రాలుగా రూపొందిస్తూ పరిపాలనను బలోపేతం చేస్తున్నాము. వాటి పర్యవేక్షణకు మండల, జిల్లా, పట్టణ స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమించాము.

### 'పల్లె బాట'లో సమస్యల పరిష్కారం:

గ్రామీణాభివృద్ధిలో భాగంగా 'పల్లె బాట' కార్యక్రమం ద్వారా గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నాము. పల్లెబాట-2 ద్వారా గ్రామాల్లో సిమెంటు రోడ్లు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నాం. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు చెప్తున్నారు. రెవెన్యూ వ్యవస్థలో కూడా పారదర్శకత తీసుకొస్తున్నాం. గతంలో హద్దు రాళ్లు, పట్టాదారు పాస్ పుస్తకాలపై వ్యక్తిగత ప్రచారం కోసం పేర్లు, బొమ్మలు ముద్రించిన పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం రైతుల ఆస్తి హక్కులను గౌరవిస్తూ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాం.

### పెట్టుబడుల రాక:

రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కోసం విశాఖపట్నం ఎకనామిక్ జోన్, అమరావతి జోన్, తిరుపతి జోన్‌లను ఏర్పాటు చేస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని మంత్రి తెలిపారు. విశాఖపట్నాన్ని గ్లోబల్ డేటా హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా పెద్ద కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. గతంలో మూతపడే పరిస్థితికి చేరిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల దిశగా నడిపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీసీ రిజర్వేషన్ల అంశంపై కూడా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి చర్యలు చేపట్టినట్టు మంత్రి స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమం, పేద ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని చెప్పారు.

# తప్పు చేయకుంటే భయమెందుకు బుగ్గనా?

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**
**- సీఎం చంద్రబాబుపై వ్యాఖ్యలకు కౌంటర్**



అమరావతి (చైతన్యరథం): రైతు భూమి కబ్జా అంశంపై మాజీ మంత్రి బుగ్గన వ్యాఖ్యలు పూర్తిగా తప్పుదారి పట్టించేలా ఉన్నాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో రెవెన్యూ శాఖను అస్తవ్యస్తం చేసి భూ సమస్యలను పెం చారు. రైతుల భూములు కబ్జా చేసిన ఘటనలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. తప్పు చేయకుంట ఎందుకు భయపడాలని ప్రశ్నించా రు. నేరం చేశారనే భయంతోనే సీఎం చంద్రబాబుపై ఆరోపణలు చేస్తున్నారు. మీ భూమి – మీ హక్కు పేరిట రైతు న్యాయం కోసం సీఎం స్వయంగా స్పందించి అధికారులను స్పాట్‌కే పిలవడం బాధ్యతాయుతమైన చర్య. భూ ఆక్రమణ నిజమైతే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతుల హక్కులను కాపాడటం కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. గతంలో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతులకు పెద్ద ముప్పుగా మారింది. ప్రజల భూములను కాపాడటానికి, రైతులకు న్యాయం చేయటానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. భూముల విష యంలో ఎలాంటి అక్రమాలు జరిగినా కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పర్యాటకానికి అవకాశాల గని ఆంధ్రప్రదేశ్

- **పెట్టుబడులతో రండి..భరోసా కల్పిస్తాం**
- **ఐఏఏపీఐ ఎక్స్‌పోలో మంత్రి కందుల దుర్గేష్**
- **అమ్యూజ్‌మెంట్, థీమ్, వాటర్ పార్క్‌లు, అడ్వెంచర్స్**
- **జోన్ల ఏర్పాటుకు భాగస్వాములు కావాలని పిలుపు**




ముంబయి/అమరావతి(చైతన్యరథం): పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ విధానాలు, మౌలిక సదుపాయాలు, సంస్కరణలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముంబయి లోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతున్న 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెం ట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఐఏఏపీఐ) ఎక్స్‌పోలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎక్స్‌పోను ప్రారంభిం చిన మంత్రి స్టాళ్లను పరిశీలించి ఏపీ పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించా లని అధికారులను ఆదేశించారు. అమ్యూజ్‌మెంట్ రంగంలోని జాతీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఉద్దేశించి ప్రసంగించా రు. ఏపీలో నూతన పర్యాటక పాలసీ 2024-29తో ఇన్వెస్టర్లకు 25 శాతం వరకు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, పారిశ్రామిక ధరలకే విద్యుత్ సరఫరా, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, 100 శాతం నెట్ ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, ఉపాధి కల్పన ఆధా రిత సబ్సిడీలు తదితర భారీ రాయితీలు కల్పిస్తున్నామని తెలిపారు. హోటళ్లు, థీమ్ పార్కులు, రిసార్టుల కోసం భూ కేటాయింపు ప్రక్రియను సరళతరం చేస్తూ 'టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2025'ను దేశంలోనే మొదటిసారిగా ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వివరించారు.

**మెగా పెట్టుబడులకు మూడు ప్రధాన నగరాలు**

అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కులు, వాటర్ ఫ్రంట్ అట్రాక్షన్స్, అడ్వెంచర్ జోన్లు, సమగ్ర వినోద కేంద్రాల ఏర్పాటుకు ఏపీలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. తీరప్రాంత సర్క్యూట్లు, ఆధ్యాత్మిక పట్టణాలు, అటవీ ప్రాంతాలు, పట్టణ వినోద కారిడార్లలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతి నూతన ఆవిష్క రణలకు అద్భుతమైన వేదిక అని, విశాఖపట్నంను అంతర్జాతీయ స్థాయి తీరప్రాంత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని, భక్తుల దృష్ట్యా ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తిరుపతిని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి వినోద కేంద్రాల నిర్మాణంలో ఇన్వెస్టర్లకు ఎదురయ్యే అడ్డంకులను తొల గించి అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ చైర్మన్ అంకూర్ మహేశ్వ రి, ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ రఫీక్, సీనియర్ కన్సల్టెంట్లు సత్యప్రభ, శివ పాల్గొన్నారు.

## వైసీపీ నేతల అక్రమాలు, ఆగడాలపై

# గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

- **హైస్కూల్ నిర్మాణం పేరుతో దౌర్జన్యంగా భూమి లాక్కున్నారని ఒకరు**
- **పట్టా భూమి కబ్జా చేసి ఇల్లు కట్టడమే కాక అడ్డుకుంటే చంపుతామని బెదిరిస్తున్నారని మరొకరు**
- **జీఎస్టీ బకాయిల పేరుతో ఇంటికి తాళం వేశారన్న తునికి చెందిన టాక్స్ కన్సల్టెంట్**
- **సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు వద్ద వాపోయిన బాధితులు**
- **అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు**



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహిం చారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్, పార్లమెంటరీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబులకు వినతిపత్రాలు ఇచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి వినతి ఇదీ... మా గ్రామంలోని సర్వే నెం.300-2(ఎ)లో గల 4.45 ఎకరాల నా పట్టా భూమిని వైసీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి హైస్కూలు నిర్మాణం పేరుతో దౌర్జన్యంగా లాక్కున్నారు. సరిపడా విద్యార్థులు లేరనే కారణంతో అప్పట్లో కలెక్టర్ ఆ ప్రతిపాదనను తిరస్కరించారు. ఆ తర్వాత సదరు భూమిని 'జగనన్న కాలనీ' కింద మార్చారు. దానికి బదులుగా సర్వే నెం.84-2లో ప్రత్యామ్నాయ భూమిని చూపిస్తూ అధికారులు సర్వే నిర్వహించి స్కెచ్ కూడా ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు అసైన్‌మెంట్ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నారు. రాజకీయ కారణాలతో నా ఫైలును పక్కన పెడుతున్నారు.

మార్కాపురం జిల్లా బెస్తవారిపేట మండలం మదనవుల్లల చెరువు గ్రామానికి చెందిన బండి శివరామిరెడ్డి అర్జీ... సర్వే నెం.320/2, 349/1ల్లోని నా పట్టా భూములను వైసీపీ నాయకులు ఆక్రమించి ఇళ్లు కట్టుకున్నారు. అడ్డుకోబోయిన నాపై భౌతిక దాడులకు తెగబడుతున్నారు. 40 ఏళ్లుగా ఉన్న వ్యవసాయ బావిని దౌర్జన్యంగా పూడ్చివేయడమే కాకుండా, 14సార్లు నా వ్యవసాయ మోటార్లను కాల్చివేసి లక్షలాది రూపాయలు నష్టం కలిగించారు. సంతకాలను ఫోర్జరీ చేసి దొంగ బాండ్లు సృష్టించి, సుమారు రూ.15లక్షల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతు న్నారు. నాకు రావాల్సిన సుమారు 2.50 కోట్ల బాకీలు రాకుండా అడ్డుకుంటున్నారు. గ్రామంలో ఎవరూ తనకు కూలీ పనులకు ఇవ్వకుండా బెదిరిస్తున్నారు. దీంతో కుటుంబం ఊరిలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది.

కాకినాడ జిల్లా తునికి చెందిన శంకర్ విజ్ఞప్తి ఇదీ... నేను స్థానికంగా టాక్స్ కన్సల్టెన్సీలో వర్క్ చేస్తున్నాను. ఆర్థిక బలం ఉన్న వైసీపీ చెందిన నాగు, శివాజీ కొంతకాలంగా అనేక రకాలుగా నన్ను ఇబ్బందిపెడుతున్నారు. వారి జీఎస్టీ బకాయిలు చెల్లించమని నాపై ఒత్తిడి చేస్తున్నారు. వారి అక్రమ డిమాండ్లకు ఒప్పుకోకపోవడంతో దౌర్జన్యంగా నా ఇంటికి తాళం వేశారు. టాక్స్ కట్టే వరకు తాళం తీసేది లేదని బెదిరిస్తున్నారు. దీంతో నా కుటుంబం తీవ్ర ఇబ్బందులపాలవుతోంది.

కృష్ణా జిల్లా పామర్రు మండలం మద్దిపట్ల గ్రామానికి చెందిన విజయకుమారి ఇచ్చిన అర్జీలో... నేను, నా తల్లి కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నాము. కొంతకాలంగా మా బంధువులు మాకున్న ఒక ఎకరం ఆస్తిపై కన్నువేసి మమ్మల్ని మానసిక, శారీరక వేధింపులకు గురిచేస్తున్నారు. ఎస్ఐ, కొంతమంది వ్యక్తులు కలిసి మాకు రావలసిన పంట నష్టపరిహారం అందకుండా చూసి అన్యాయం చేస్తున్నారు. నాకొచ్చిన 50 పెళ్లి సంబంధాలను చెడగొట్టారు. అద్దె ఇల్లు ఖాళీ చేయించి ఇంట్లోని విలువైన వస్తువులను దొంగిలించారు.

పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం తండాకు చెందిన జయరాంనాయక్ అర్జీ... నా ఖాళీ స్థలాన్ని గ్రామానికి చెందిన హనుమానాయక్, ఇతరులు ఆక్రమించుకున్నారు. దీని వెనుక వినుకొండ సబ్ కోర్టులో పనిచేసే ఒక లాయర్, మరికొంత మంది వ్యక్తుల హస్తం ఉంది. తహసీల్దారు రూ.50వేలు, వీఆర్వో రూ.25వేలు తీసుకుని ఆక్రమణదారులకే వత్తాసు పలుకుతున్నారు. ఈ అంశంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు.

బాపట్ల జిల్లా వేటపాలెం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన వెంకటరత్నం అర్జీ... నాకున్న 44 సెంట్ల భూమికి 40 సెంట్లు విక్రయించాను. మిగిలిన 4 సెంట్ల భూమిని కొలిచి హద్దులు చూపాలని అధికారులు కోరారు. 8/11/2025న సర్వే చేసిన వేటపాలెం మండల సర్వేయర్ వాస్తవాలకు విరుద్ధంగా రిపోర్ట్ ఇచ్చారు. పక్షపాత ధోరణితో దక్షిణం వైపు ఉండాల్సిన హద్దును పడమర వైపు చూపించారు. దీంతో మా భూమికి కనీసం నడవడానికి దారి కూడా లేకుండా పోయింది.

చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం కె.పట్నం గ్రామానికి చెందిన సుధ అర్జీ... మా పూర్వీకులు గత 50 ఏళ్లుగా ఇదే గ్రామంలో నివసిస్తున్నారు. ఐరాల క్రాస్ వద్ద రోడ్డుకు ఆనుకుని ఉన్న సుమారు 25 సెంట్ల ప్రభుత్వ స్థలంలో గత 40 ఏళ్లుగా పశువులు, మేకలను మేపుకుంటూ ఒక చిన్న గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఇదే మాకు జీవనాధారం. ఇటీవల కొం దరు వ్యక్తులు వచ్చి "నీలాంటి వాడికి రోడ్డు పక్కన భూమి ఎందుకు?" అంటూ కులం పేరుతో దూషిస్తూ బెదిరించి అక్కడి నుంచి తరిమేశారు. ఆ స్థలాన్ని ఆక్రమించుకుని రాత్రికి రాత్రే కంచె కూడా వేశారు. దీంతో మేం పశువులను, మేకలను కట్టుకోవడానికి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బిళ్లనపల్లి బొబ్బావెంకట విద్యాసాగర్... మా గ్రామంలో సర్వే నంబర్లు 49 & 50 (L.P.No.1042)కి సంబంధించి రికార్డుల ప్రకారం మాకు 1.22 ఎకరాల భూమి ఉంది. అయితే F-LINE దరఖాస్తు చేయగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన సర్వేయర్ అందులో సుమారు 0.22 సెంట్లు ఎన్ఎస్‌పీ కెనాల్ పరిధిలోకి వెళ్లిందని చెప్పారు. రికార్డుల్లో భూమి ఉన్నట్టు చూపిస్తూ క్షేత్రస్థాయిలో లేకపోవడంతో నష్టపోతున్నాం. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. సర్వే నెం.130/10లో 0.28 సెంట్ల పట్టా భూమికి రీ సర్వే తర్వాత ఎటువంటి ఎల్‌పీ నెంబరూ కేటాయించలేదు. సదరు భూమిని నిబంధనలకు విరుద్ధంగా 'గ్రామ కంఠం' కింద మార్చారు. బాధ్యులపై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరాడు.

పల్నాడు జిల్లా రొంపిచర్లకు చెందిన బత్తుల ఆదిలక్ష్మి గ్రీవెన్స్ లో పేర్కొందిలా... 2009లో సత్తెనపల్లి పరిధిలో ప్రాకినేని పాపారావు వద్ద 10 సెంట్ల భూమి కొనుగోలు చేశాను. అందులో 4.5 సెంట్లు రోడ్డు విస్తరణలో పోగా మిగిలింది నా స్వాధీనంలో ఉంది. నాకు అమ్మిన పాపారావు అదే భూమిని దురుద్దేశంతో ప్లాట్ నంబర్లు, సరైన హద్దులు లేకుండా మరికొంత మందికి (సుమారు నలుగురికి) దొంగ రిజిస్ట్రేషన్లు చేశాడు. దీనిపై పోలీస్ స్టేషన్, తహసీల్దారు కార్యాలయంలతో పాటు కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశాను. అయినా ఎటువంటి పురోగతీ లేదు.

వీటితో పాటు పలువురు పింఛను, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని ఇంకొందరు అభ్యర్థించారు.

చైతన్యరథం

# టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



- ఒత్తిడికి దూరంగా ప్రశాంతంగా పరీక్షలు రాయాలు
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- అంబేద్కర్ గురుకులాల విద్యార్థులతో జూమ్ కాన్ఫరెన్స్

అమరావతి(చైతన్యరథం): అంబేద్కర్ గురుకులాలు, సాంఘి క సంక్షేమ వసతిగృహ విద్యార్థులపై మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులతో వరుస వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి టీచర్, సొంత పేరెంట్‌లా మంత్రి విద్యార్థులకు ధైర్యం చెప్పి పలు సూచనలు చేస్తున్నారు. మంగళవారం తాడేపల్లి ఎపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యాలయంలో అంబేద్కర్ గురుకులాల 10వ తరగతి విద్యార్థు లతో మంత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష లు రాయాలని విద్యార్థులకు సూచించారు. 100 శాతం విద్యార్థు లంతా ఉత్తీర్ణత సాధించాలని, కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పరీక్షల సమ యంలో విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల న్నారు. విద్యార్థులు కొద్దిపాటి అనారోగ్యానికి గురైనా నిర్లక్ష్యం చేయకుండా వైద్యం అందించాలన్నారు. విద్యార్థులను బస్సులో పరీక్ష కేంద్రా లకు తీసుకెళ్లి తిరిగి హాస్టళ్లకు చేర్చే వరకు పర్య వేక్షించాలన్నారు. పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు. ఎపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్ కార్యదర్శి వి.ప్రసన్న, అదనపు కార్యదర్శి రాజ్యలక్ష్మి, జాయింట్ సెక్రటరీ రూపావతి తదితరులు పాల్గొన్నారు.

## ఈఎస్ఐ సేవల విస్తరణకు చర్యలు

- భవన కార్మికులను పరిధిలోకి తీసుకొస్తాం
- కార్మికుల భద్రతకు కట్టుబడి ఉన్నాం
- వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్



విజయవాడ (చైతన్యరథం): ఈఎస్ఐసీ వజ్రోత్సవ వేడుకలలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి పనిచేస్తున్నాయని తెలిపారు. కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈఎస్ఐ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. పరిశ్రమల అభివృద్ధితో పాటు కార్మికుల భద్రత కూడా అంతే ముఖ్యమని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఈఎస్ఐ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మరిన్ని ఆసుపత్రులు, డిస్పెన్సరీలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. కొంతమంది యజమానులు వారి పరిశ్రమంలో పనిచేసే వారికి ఈఎస్ఐ కట్టకుండా కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఇప్పటికైనా యాజమాన్యాలు పరిశ్రమల కార్మికులు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఇలాంటి పునరావతమైతే కఠినమైన చర్యలు తీసుకోవడం తప్పదని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులను కూడా ఈఎస్ఐ లోకి తీసుకొస్తాం. దానికోసం కేంద్ర మంత్రిత్వ శాఖతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఈఎస్ఐ కార్మికుల జీవితాల్లో వెలుగు నింపుతుందని తెలిపారు.

## 19 నుంచి ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రులు

- ఆలయంలో ఘనంగా ఏర్పాట్లు
- పలు రకాల పుష్పాలతో అమ్మవారికి అర్చన
- 19న ఉగాది, 27న శ్రీరామనవమి సంబరాలు



విజయవాడ(చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు చైత్రమాస వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ట్లు ఈవో శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అదేరోజు ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం జరుగుతా యని, 27న శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 19వ తేదీ వేకువజామున 3 గంటలకు అమ్మవారికి స్నపన, పూజాధికాలు పూర్తయ్యాక ఉదయం 8 నుంచి దర్శనానికి అనుమతిస్తారు. 9.15 గంటలకు ప్రత్యేక పుష్పార్చనకు శ్రీకారం చుడతారు. 3 గంటలకు పంచాంగ శ్రవణం, సాయంత్రం 6 గంటలకు మల్లికార్జున మహామంపడం నుంచి వెండి రథోత్సవం జరుగుతాయి. 26వ తేదీ చైత్రశుద్ధ అష్టమిని పురస్కరించుకుని ఘాట్‌రోడ్డులోని ఆలయంలో ఆంజనే య స్వామికి, ప్రధాన ఆలయంలోని క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజ చేస్తారు. 27వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. 28వ తేదీ ఉదయం 9 గంటలకు వసంత నవరాత్రులను పూర్ణాహుతితో ముగిస్తారు. అదేరోజు 10 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుంది. వసంత నవరాత్రుల్లో రోజూ వివిధ రకాల పూలతో అమ్మవారిని అర్చిస్తారు. పుష్పార్చనలో పాల్గొనేవారు రూ.2,500 రుసుము చెల్లించాలని ఈవో ఆ ప్రకటనలో వివరించారు.

## తణుకులో జిమ్, బ్యాడ్మింటన్ కోర్టులు

- ప్రారంభించిన శాప్ చైర్మన్ రవినాయుడు
- క్రీడా సదుపాయాలు, వికాస్ కేంద్రం సందర్శన



తణుకు(చైతన్యరథం): తణుకు పర్యటనలో భాగంగా శాప్ చైర్మన్ రవినాయుడు తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణతో కలిసి పలు క్రీడా సదుపాయాలను ప్రారంభించి పరిశీలించారు. తణుకు పట్టణం 3వ వార్డులో నూతనంగా నిర్మించిన మున్సిపల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, పికిల్ బాల్, బ్యాడ్మింటన్ కోర్టులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ తణుకు పట్టణంలోని పార్కుల్లో ప్రజలకు, ముఖ్యంగా యువతకు క్రీడా సదుపాయాలను అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ ఇండోర్ స్టేడియం, జిమ్, స్విమ్మింగ్ పూల్ సదుపాయాలను వారు పరిశీలించారు. ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పరిస్థితిని సమీక్షించారు. మరమ్మతులు, ఆధునికీకరణ కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై సాను కూలంగా స్పందించిన రవినాయుడు త్వరలోనే అవసరమైన కార్యచరణ రూపొందించి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదే పర్యటనలో భాగంగా మున్సిపా లిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న క్రికెట్ నెట్స్‌ను కూడా పరిశీలించారు. అలాగే ఎస్సీఐఎం డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో నిర్మిస్తున్న సింథటిక్ వాకింగ్ ట్రాక్ పనులను సందర్శించి పురోగతిని సమీక్షించారు. అనంతరం తణుకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ ప్రాంగణంలో శాప్ నిధులతో నిర్మిస్తున్న క్రీడా వికాస్ కేంద్రాన్ని వారు పరిశీలించారు. నిర్మాణం చివరి దశలో ఉన్న స్టేడియాన్ని పరిశీలించారు. అనంతరం తణుకు నియోజకవర్గంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సందర్భంగా ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసిన కార్యక్ర మంలో రవినాయుడు పాల్గొన్నారు. తణుకు పట్టణంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 9 నుంచి 14 సంవత్సరాల బాలికలకు గర్భాశయ ముఖ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణ కోసం హెచ్‌పీవీ వాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మాల్లో శాప్ బోర్డు సభ్యులు, తణుకు ఏఎంసీ చైర్మన్, కూటమి నాయకులు, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

## టీటీడీ విద్యాసంస్థల్లో డిజిటల్ తరగతి గదులు

- వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.118 కోట్ల ఖర్చు
- ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు

తిరుపతి(చైతన్యరథం): విద్యాబోధనలో వస్తున్న విప్లవాత్మకమై న మార్పులను విద్యార్థులకు అందించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. విద్యాసంస్థల్లో ప్రస్తుతం ఉన్న తరగతి గదులను డిజిట ల్ తరగతి గదులుగా మార్చేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం రానున్న బడ్జెట్‌లో రూ.118.89 కోట్లు పొందుపర్చింది. తరగతి తగదులను ఆధునికీకరించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన వసతి, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు టీటీడీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో ప్రస్తుతం 31 విద్యాసంస్థలు నడుస్తున్నాయి. టీటీడీ పాఠశాలలు, కళాశాలల్లోని తరగతి గదులను డిజిటల్ క్లాస్‌రూమ్‌లుగా మారుస్తారు. ఇందుకోసం ఆయా క్లాస్‌రూమ్‌లలో ఇంటర్‌యాక్టివ్ ప్యానల్ బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం సుమారు 260 గదులు ఉన్నట్లుగా గుర్తించారు. ఒక్కో ప్యానల్ బోర్డు ఏర్పాటుకు సుమారు రూ.2 లక్షలు ఖర్చవుతుందని, మొత్తంగా రూ.5.20 కోట్లు అవసరమని అంచనా వేశారు. మరోవైపు పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల డేటా, అడ్మిషన్లు, అటెండెన్స్, ఫీజు, పరీక్షలు ఇలా అన్ని అంశాలను ఒకే దగ్గరకు తీసుకొచ్చేందుకు ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేయడం/అవసరమైతే కొనుగోలు చేసేందుకు టీటీడీ అధికారులు సిద్ధమవుతున్నారు. అలాగే ఆయా విద్యాసంస్థల్లో అవసరమైన కంప్యూటర్లను అందుబాటులోకి తేనున్నారు. ఇందులో కొన్నింటిని దాతల ద్వారా అందించేందుకు టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి హామీ ఇచ్చారు.

ఐఐటీ, నీట్‌లో కోచింగ్..

ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు దీటుగా టీటీడీ కళాశాలల్లోని వారు పోటీ పరీక్షల్లో రాణించేందుకు అనుగుణంగా వారికి శిక్షణ ఇవ్వాలని ఇప్పటికే పాలకమండలి నిర్ణ యించింది. ప్రధానంగా ఐఐటీ, నీట్, సీఏఏ, సీఎల్ఏటీతోపాటు ఇతర పరీక్షలకు తర్ఫీదు ఇవ్వనున్నారు. అలాగే ఒకేషనల్, స్కిల్ డెవల్‌పమెంట్, జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను అవసరమైన మేరకు ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు ఎస్వీడబ్ల్యూ



డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం అత్యవసర వైద్య సేవలు అందించ డానికి మొబైల్ మెడికల్ యూనిట్‌ను (క్లినిక్ ఆన్ వీల్స్) అందు బాటులోకి తీసుకురానున్నారు. దాత ద్వారా ఏర్పాటు చేయడానికి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ముందుకు వచ్చారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

# రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు

- ఎప్పటికప్పుడు సరఫరాను పర్యవేక్షిస్తున్నాం
- గృహ వినియోగదారులకు ఇబ్బందులుండవు
- బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా నిఘా బృందాలు
- ఉన్నతాధికారులతో సమీలో మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గృహ అవసరాలకు, వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ప్రస్తుతానికి ఇబ్బంది లేదని తెలిపారు. కీలకమైన ఈ సమయంలో ఎల్పీజీ గ్యాస్ అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా జిల్లాల వారీగా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. అంతర్జాతీయ యుద్ధ వాతావరణం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై మంగళవారం ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ప్రస్తుతం రాష్ట్రానికి అందుబాటులో ఉన్న గ్యాస్ నిల్వల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అవసరం అయితే వాణిజ్య అవసరాలకు అందించే ఎల్పీజీ గ్యాస్‌ను ప్రాధాన్యతల ప్రకారం అందించే ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతానికి రాష్ట్రానికి సంబంధించి హెచ్‌పీసీ విశాఖపట్నం రిఫైనరీ, మంగళూరు నుంచి వచ్చే హాస్సన్ చర్లపల్లి పైపులైను, విశాఖలోని హెచ్‌పీసీ, బీపీసీ, ఐఓసీల ద్వారా రాష్ట్రం



నుంచి సరఫరా అవుతున్న గ్యాస్ సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. రోజువారీ అవసరాలకు సరిపడా నిల్వల్లో ఏ మాత్రం తేడా వచ్చినా ప్రత్యామ్నాయంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముందుకు వెళతామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు ఇబ్బందుల పడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రత్యేక నిఘా బృందాలను నియమించుకుని గ్యాస్ పక్కదోవ పట్టకుండా జాయింట్ కలెక్టర్లు నియంత్రించాలని ఆదేశించారు. రకరకాల పుకార్లతో ఇష్టానుసారం ధరలు పెంచినా, వదంతులు వ్యాప్తి చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటి కప్పుడు జిల్లాల వారీగా సరఫరా చైన్‌ను పర్యవేక్షిస్తూ ఎక్కడైనా సరఫరాలో లోపాలు వస్తే వెంటనే సరిదిద్దే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు చూసి ఆందోళనకు గురికారాదని సూచించారు.

# గల్ఫ్ నుంచి ప్రవాసీయుల తరలింపు ప్రక్రియ

**అధికారులతో మంత్రి రామ్మోహన్‌నాయుడు సమీక్ష - వీసా సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశం**



అమరావతి (చైతన్యరథం): గల్ఫ్‌లో సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పౌర విమానయాన శాఖ, డీజీసీఏ శాఖ అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. పశ్చిమాసియా దేశాల్లో చిక్కుకుపోయిన వారిని స్వదేశానికి తరలించేందుకు గత పది రోజులుగా చేపట్టిన చర్యల గురించి అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. వివిధ ప్రాంతాల్లోని స్థానిక రాయబార కార్యాలయ అధికారులు, విమాన యాన సిబ్బంది సమన్వయంతో ప్రయాణికులను సురక్షితంగా స్వదేశానికి తరలిస్తున్నామని వివరించారు. గత నెల 28 నుంచి ఇప్పటివరకూ తీసుకున్న చర్యల గురించి వివరించారు. నేటి నుంచీ అమలు చేయబోతున్న ప్రణాళికనూ అధికారులు వివరిం చారు. దోహా నుంచి ఢిల్లీ, ముంబై, కొచ్చిలకు ప్రతిరోజు సుమారు 850 మందిని తరలిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. సౌది అరేబియాలోని దమ్మామ్ విమానాశ్రయం నుంచి కొచ్చికి ప్రతి రోజూ సగటున 166 మందిని తరలించామని తెలిపారు. నేడు తెలుగు వారిని బహ్రెయిన్ నుంచి దమ్మామ్‌కు తరలించి, అక్కడి నుంచి గల్ఫ్ ఎయిర్ విమానంలో కొచ్చికి తీసుకువస్తున్నట్లు చెప్పా రు. ఈనెల 16వ తేదీ వరకు గల్ఫ్ ఎయిర్‌సంస్థ దోహా, దమ్మామ్ విమానాశ్రయాల నుంచి ఢిల్లీ, ముంబై, కొచ్చిలకు భారతీయులను తరలించేందుకు షెడ్యూల్ ఇచ్చినట్లు చెప్పారు. గల్ఫ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి భారతీయులను ఈ రెండు విమానాశ్రయాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. విదేశాంగ శాఖ అధికారులతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ భారతీయులను సురక్షితంగా తరలించే ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి వివరించారు. విమానయాన సంస్థలు అన్నీ కలిపి ఇప్పటివరకూ సుమారు లక్ష మంది భారతీయులను స్వదేశానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. తరలింపు ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. వీసా సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గత పది రోజులుగా అధికారులతో కలిసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలు సలహాలు ఇస్తున్నారు.

# ఎండ తీవ్రత, వడగాల్పులపై అప్రమత్తం

- ప్రాణనష్టం నివారణే ప్రభుత్వ లక్ష్యం
- వడదెబ్బ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశం
- హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ - 2026 ఆవిష్కరణ

విజయవాడ(చైతన్యరథం): రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. తాడేపల్లిలోని మంగళవారం ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్స్, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో ఎండ తీవ్రత, వడగాల్పుల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాల్పు ల దృష్ట్యా ప్రజల ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ – 2026'ను మంత్రి ఆవిష్కరించారు. హీట్ వేవ్ మరణాలు లేకుండా శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదే శించారు. విపత్తు నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ నుంచి అందే వడ గాల్పుల హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, వారిని అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఒక్క ప్రాణం కూడా వడదెబ్బ వల్ల పోకూడదనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు బహిరంగ ప్రదేశాల్లో ఎటువంటి పనులు చేయకుండా పనివేళలను రీ షెడ్యూల్ చేయాలని ఆదేశించారు.

### వృద్ధులు, పిల్లల విషయంలో జాగ్రత్తలు

ముఖ్యంగా కార్మికులు, వృద్ధులు, పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. వడదెబ్బ బారిన పడే వారి కోసం ఆసు పత్రులలో ప్రత్యేక బెడ్లు, మందులు, అంబులెన్సులను సిద్ధం చేయాలని వైద్యశాఖను ఆదేశించారు. బస్టాండ్లు, మార్కెట్లు, కూడళ్లు మరియు పర్యాటక ప్రాంతాల్లో తప్పనిసరిగా చలివేం ద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్జీవోలు, కమ్యూనిటీ గ్రూపు ల ద్వారా




మజ్జిగ, మంచి నీరు పంపిణీ చేయాలని సూచించారు. ఎండల వల్ల పశువులకు ముప్పు కలగకుండా గ్రామాల్లోని నీటి తొట్టెలను ట్యాంకర్లతో నిరంతరం నింపాలని, పశు గ్రాసం విష యంలో రైతులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే ఎండల దృష్ట్యా గృహ అవసరాలకు విద్యుత్ అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. ఆర్ డబ్ల్యూ ఎస్, గ్రామీణాభివృద్ధి వంటి కీలక శాఖలు మండల, గ్రామస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించాల న్నారు. దేవాలయాలు, టూరిస్ట్ స్పాట్ల వద్ద తాగునీటి సదుపా యం, మెడికల్ క్యాంపులు నిరంతరం ఉండాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

### చెరువులు, కుంటల దగ్గర హెచ్చరిక బోర్డులు

వేసవి సెలవుల్లో పిల్లలు చెరువులు, నీటి కుంటలు వద్ద ఆడుకునే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నందున అటు వంటి చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించా రు. ఫైర్ డిపార్టుమెంటు తప్పనిసరిగా హాస్పిటల్స్, హోటళ్లు, ప్రవేటు బిల్డింగ్స్‌లో వైరింగ్, ఇతర ఫైర్ సేఫ్టీ వంటివి తనిఖీ చేయాలన్నారు. కలెక్టర్లు ఎండ తీవ్రత సమాచారం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 నెంబర్లు ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమీక్షలో విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఎస్డీఆర్ఎఫ్ ఐజీపీ రాజకుమారి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ఫైర్ డిపార్టమెంట్ అడిషనల్ డైరెక్టర్ జ్ఞానసుందర్, జిల్లాల నుంచి కలెక్టర్లు, డీఆర్వోలు వర్చువల్‌గా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అన్నదాతల భూ హక్కులకు భద్రతే లక్ష్యం

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**- యనమదల పట్టాదారు పాస్‌పుస్తకాలు**



చేజర్ల (చైతన్యరథం): ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలం యనమదల గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణీ చేశారు. గ్రామంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రైతులకు భూ హక్కులపై పూర్తి భద్రత కల్పించేందుకే ప్రభుత్వ రాజముద్రతో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే భూ యజమానికి సంబంధించిన పూర్తి వివరాలు వెంటనే కనిపించేలా ఈ పాస్ పుస్తకాలను రూపొందించామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావిడిగా రాష్ట్రంలో 30 లక్షల పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు పంపిణీ చేసిందని, ఈ పాస్ పుస్తకాలు విలువలేని చెల్లని నోట్లతో సమానమనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యనమదల గ్రామపంచాయతీలో రూ.18 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా ఆరు గోకులం షెడ్ల నిర్మాణాలకు మంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. దేవాదాయ శాఖ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న శ్రీ గంగ మ్మతల్లి దేవస్థానం ప్రహరీ గోడకు భూమిపూజ చేశారు. అలాగే ఈ ఆలయానికి అనుబంధంగా ముఖ మండపం భజన మందిర నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం చేజర్ల మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.8,53,631 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి పావని, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.10 లక్షల విరాళం

**- బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి అందజేత**

తిరుపతి(చైతన్యరథం): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు రూ.10 లక్షల విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన కియోరా ఇన్ఫ్రా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎండీ కోడెల శివరామకృష్ణ తన కుటుంబసభ్యులతో కలిసి ఈ విరాళాన్ని అందించారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనం లోని ఈవో ఛాంబర్‌లో ఈవో ముద్దాడ రవిచంద్రకు దాత విరాళం డీడీని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించారు.



## మన్యంలో గోబాల సంబరం కార్యక్రమం

**● పశుసంవర్థక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి : తోయక జగదీశ్వరీ**



కురుపాం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం గుమ్మ గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నాడు మన్యం గోబాల సంబరం (లేగదూడల ప్రదర్శన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యులు తోయక జగదీశ్వరి హాజరై లేగదూడల ప్రదర్శనను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పశు సంవర్థక రంగ అభివృద్ధికి ప్రతిష్ఠాత్మకంగా ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా పశు సంవర్థక శాఖ నుంచి లభించే ఆర్థిక వనరులను పెంపొందించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే మెరుగైన జాతి పశువుల అభివృద్ధి కోసం లింగ నిర్ధారిత ఇంజెక్షన్‌ను కేవలం రూ.150కే అందుబాటులో ఉంచామని, ప్రతి రైతు సేవా కేంద్రంలో ఈ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డా. ఎస్. మన్మథరావు మాట్లాడుతూ పశువులకు ప్రభుత్వం రాయితీతో పశు బీమా పథకం అమలు చేస్తున్నదని, అలాగే పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణా అందజేస్తున్నామని చెప్పారు. ప్రతి పాడి రైతు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లేగదూడల పాడి రైతులకు బహుమతులు అందజేశారు. అలాగే పశు బీమా నష్టపరిహారం చెక్కులను రైతులకు అందజేసి, సబ్సిడీ దాణాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు, శాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓర్వలేక వైసీపీ నాయకులు విమర్శలు

**● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మండిపాటు**



లజాతీయ ,అంతర్జాతీయ స్థాయిలో ఎదిగిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని చూసి ఓర్వలేక వైకాపా నాయకులు లేనిపోని విమర్శ చేయడం విమర్శలు సరికాదని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ... కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుపై కొందరు వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. అభివృద్ధి చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నుండి “యంగ్ గ్లోబల్ లీడర్ అవార్డు” అందుకున్న రామ్మోహన్ నాయుడు సిక్కోలు జిల్లాను జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని చెప్పారు. అలాంటి నాయకుడు దొరకటం మనందరికీ గర్వకారణమని తెలిపారు. జిల్లాకు అభివృద్ధి తీసుకురావడంతో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఒడిస్సాతో సంబంధం ఉన్న నీటిపారుదల సమస్యలు మరియు నేరడి బ్యారేజ్ వంటి అంశాల పరిష్కారానికి కేంద్ర స్థాయిలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే సిక్కోలు అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు కింజరాపు ఎర్రంనాయుడుపై కూడా అనవసర వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. విజనరీ నాయకుడు నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌బాబు సహకారంతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు.

## పేద ప్రజలకు సహాయం చేయడం అల్లాహ్ మెచ్చిన కార్యం



ఉయ్యూరు (చైతన్యరథం): మున్సిపాలిటీ, కాటూరు రోడ్‌లో రంజాన్ మాసం సందర్భంగా కొండపల్లి అబ్దుల్ బషీర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 50 పేద కుటుంబాలకు రంజాన్ తోఫా, నిత్యవసర సరుకులు ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ముస్లిం సోదరులు పవిత్రంగా భావించే ఈ రంజాన్ మాసంలో ఈ విధంగా పేద ప్రజలకు సహాయాలు చేయడం మంచి పరిణామం అని, అల్లాహ్ కూడా కురాన్‌లో పేద ప్రజలకు మనకు తోచిన సహాయం చేయాలని చెప్పి ఉన్నారని, ఈ కార్యక్రమం చేపట్టిన బషీర్ కుమారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో బషీర్ కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ గ్రామాల దిశగా అడుగులు : ఎమ్మెల్యే గొండు శంకర్

**● గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వెల్లడి**



(శ్రీకాకుళం (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా గార మండలం శాలిహుండం గ్రామంలో ఎంపీడీవో కార్యాలయం పరిధిలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాన్ని స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించడంతో పాటు చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించేందుకు ఈ స్వచ్ఛ రథాన్ని వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ... గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటికి ప్రజలు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా కార్యక్రమం అనంతరం మున్సిపాలిటీ సిబ్బందికి చెత్త సేకరణ కోసం ట్రైసైకిళ్లు మరియు చెత్త డబ్బాలను ఎమ్మెల్యే గొండు శంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ రథం, ట్రైసైకిళ్ళు వంటి వసతులు అందించడం ద్వారా చెత్త సేకరణ వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామాలను శుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే గ్రామాల్లో సేకరించే వ్యర్థ పదార్థాలను కూడా వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్లాస్టిక్, ఐరన్ వంటి పాడైపోయిన వస్తువులు లేదా ఇతర వేస్ట్ మెటీరియల్‌ను తీసుకువస్తే వాటికి బదులుగా నిత్యవసర సరుకులు ఇవ్వబడే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి వారంలో ఒకసారి ప్రతి గ్రామానికి స్వచ్ఛ రథం వెళ్లి నిర్వహించబడుతుందని చెప్పారు. చెత్తగా భావించే వస్తువుల నుంచే సంపద సృష్టించవచ్చని, దీనివల్ల గ్రామాల్లో పరిశుభ్రత పెరగడంతో పాటు ప్రజలకు కూడా ఉపయోగం ఉంటుందని తెలిపారు.

## పేద వర్గాలను ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం

**●ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**●రాజకీయాలకు అతీ తంగా సీఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం**

**●మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు**



నిమ్మాడ (చైతన్యరథం): రాజకీయాలకు అతీతంగా ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా పేద వర్గాలను కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వివిధ అనారోగ్య కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు 9 మంది లబ్ధిదారులకు రూ.ఏడు లక్షల 50 వేలు లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేద ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఆశయంతో నా వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుంది అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులు ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్యసహాయం అందజేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబునాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన మంత్రి వర్యులకు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళల ఆరోగ్యంపై సర్కార్ ప్రత్యేక శ్రద్ధ : మిరియాల శిరీషాదేవి

**●రంపచోడవరంలో క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకాల పంపిణీ**

**●ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల**



రంపచోడవరం (చైతన్యరథం): క్యాన్సర్ రోగానికి ముందస్తు నివారణ చర్యలుగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ):వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య శాఖాధికారి పి.సరిత సౌజన్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రాముఖ్యంగా ముందస్తు అవగాహన లేకపోవటంతో అనేకమంది రోగాలు బారిన పడుతున్నారన్నారు. అందులోనూ మహిళల్లో ఎక్కువగా క్యాన్సర్ వ్యాధులతో బాధ పడుతున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా క్యాన్సర్ నివారణ కొరకు ప్రభుత్వం ఉచితంగా HPV వ్యాక్సిన్ పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశయ, గొంతు, జననేంద్రియ క్యాన్సర్ వ్యాధుల బారినుండి 90 శాతం వరకూ రక్షణగా ఉంటుందన్నారు. దీనిని ప్రస్తుతం 9 నుండి 14 సం”లు మధ్య వయసు గల బాలికలకు టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది చైతన్యం చేపట్టాలని సూచించారు. ఆయా వయసులో ఉన్న వారికి నూరు శాతం వ్యాక్సిన్ పూర్తి చేయాలని సూచించారు. దీనిలో ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు.

**మాజీ వైస్ ఎంపీపీ సుభాష్ చంద్రబోస్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే శిరీషాదేవి**

కార్యకర్తల కష్టాన్ని తన కష్టంగా భావిస్తానని రంప చోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంప చోడవరంలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ వైస్ ఎంపీపీ వై.సుభాష్ చంద్రబోస్‌ను మంగళవారం ఆమె పరామర్శించారు. రంప చోడవరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి భర్త మాజీ వైస్ ఎంపీపీ వై.సుభాష్ చంద్రబోస్‌ను ఆమె పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# పాలలో కల్తీని గుర్తించండి... ఇలా..!

**●అనుసరించాల్సిన పద్ధతులపై ప్రజల్లో అవగాహన**

**●కరపత్రాలు, సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల ద్వారా చర్యలు**

**●ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి**







రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో పాలు, పాల పదార్థాల్లో కల్తీని ఇంట్లోనే సులువుగా గుర్తించవచ్చునని రాష్ట్ర ఆహార భద్రత శాఖ (ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్) వెల్లడించింది. ఏటవాలుగా పళ్లాన్ని ఉంచి పాల చుక్కను వదలినప్పుడు.. స్వచ్ఛమైన పాలు కనుక అయితే తెల్లటిధార మాదిరిగా దిగుతుంది. అదే నీరు కలిపిన పాలు అయితే తెల్లటి ధార లేకుండా త్వరగా కిందకి దిగిపోతుందని రాష్ట్ర ఆహార భద్రత శాఖ తెలిపింది. ఇలా చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా కల్తీ పాలు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండవచ్చు అని పేర్కొంది.

రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తాజాగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశించిన ప్రకారం... కల్తీ పాలను ఎలా గుర్తించాలి అన్నదానిపై ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ ) నీలకంఠారెడ్డి ఓ ప్రకటన జారీ చేశారు. ఫుడ్సేఫ్టీ అథారిటీ వారు పాలు, పాల ఉత్పత్తుల్లో జరిగే కల్తీని ఎలా కనుగొనాలో తెలియజేస్తూ పేర్కొన్న అంశాల (సూచనలు)ను కరపత్రాలు, పుస్తకాల రూపంలో ప్రచురించి విద్యా సంస్థలకు పంపిణీ చేయబోతున్నట్లు ఐపీఎం డైరెక్టర్ నీలకంఠారెడ్డి తెలిపారు. వీటి ద్వారా ముఖ్యకూడళ్లలోనూ ప్రచారాన్ని జరుపుతామన్నారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేసేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

**యూరియా లేదా డిటర్జంటు కలిసిందో లేదో తెలుసుకోవాలంటే..!**

ఓ గ్లాసులో 10 ఎంఎల్ పాలు, 10 ఎంఎల్ నీటిని కలిపి, బాగా కదలించాలి. అప్పుడు పై భాగంలో మందమైన నురుగు ఏర్పడుతుంది. అదే స్వచ్ఛమైన పాలు అయినట్లయితే నురుగ రాదు. నురుగ వస్తే మాత్రం కల్తీ జరిగినట్లు గుర్తించాలి.

**రంగు మారితే..!**

మొక్కజొన్న లేదా ఇతర పిండి పదార్థాలను చిక్కదనం కోసం పాలలో కలిపారా లేదా తెలుసుకోవాలంటే ఓ గ్లాసులో పాలు తీసుకుని అయోడిన్ ద్రావణాన్ని రెండు, మూడు చుక్కలు కలిపినట్లయితే సదరు పాలు నీలం రంగులోనికి మారుతుంది. ఇదే జరిగితే కల్తీ జరిగినట్లు భావించాలి. రంగు మారకుండా ఉంటే వాటిని స్వచ్ఛమైన పాలుగా పరిగణించాలి.

బంగాళాదుంప లేదా చిలకడ దుంప, ఇతర పిండి పదార్థాలను నెయ్యిలో కలిపారా? లేదా అని తెలుసుకోవడానికి ఒక స్పూన్ నెయ్యిని చిన్న గాజు గిన్నెలో వేయాలి. తర్వాత రెండు, మూడు చిన్న అయోడిన్ ఉప్పు ద్రావణాన్ని వేయాలి. అప్పుడు నెయ్యి నీలం రంగులోనికి మారితే కల్తీ జరిగినట్లు భావించాలి.

**నెయ్యిలో వనస్పతి, పామాయిల్ ఉందా లేదో తెలుసుకోవాలంటే**

ఒక స్పూన్లో నెయ్యి తీసుకుని, కొంచెం చక్కెర కలిపి వేడిచేసినప్పుడు అది ఎరుపు లేదా పింక్ రంగులోనికి మారితే వనస్పతి కలిపినట్లు గుర్తించాలి. అలాగే గ్లాస్ వేడినీటిలో స్పూన్ నెయ్యిని వేస్తే.. ఒరిజనల్ నెయ్యి అయిన పక్షంలో అది పైన తేలుతుంది. వనస్పతి కలిపిన నెయ్యి అయితే చిన్నచిన్న ముద్దులుగా మారి కనిపిస్తుంది.

ఒక చుక్క నెయ్యిని అరచేతిలోనికి తీసుకుని గట్టిగా రుద్దినట్లయితే సువాసన రావాలి సువాసన రాకుండా ఉంటే నెయ్యిలో కల్తీ జరిగినట్లుగా భావించాలి.

**కల్తీ గురించి తెలిస్తే ఫిర్యాదు చేయాలి!**

కల్తీ ఘటనల గురించి తెలిస్తే 1800 425 3857 (టోల్-ఫ్రీ నెంబరు), 08645 297245 (ఐపీఎం ప్రధాన కార్యాలయం)కు తెలియజేయాలని డైరెక్టర్ నీలకంఠారెడ్డి సూచించారు







# ఆధ్యాత్మిక క్షేత్రంగా రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని తీర్చిదిద్దుతాం

**● గిరిప్రదక్షిణ రోడ్డు పనులను పరిశీలించిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

వినుకొండ (చైతన్యరథం): వినుకొండ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా, ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. కొండ చుట్టూ జరుగుతున్న గిరి ప్రతిక్షణ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయంగా ప్రోక్లైనర్ యంత్రాన్ని స్వయంగా ఆయన నడిపి రోడ్డు నిర్మాణ పనుల వివరాలను కూలంకషంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మాట్లాడుతూ... త్రేతాయుగంలో సాక్షాత్తు శ్రీరామచంద్రుల వారు కొండపై శివలింగాన్ని ప్రతిష్టించారని అందుకే శ్రీ రామలింగేశ్వర స్వామిగా ప్రసిద్ధిగాంచడం జరిగిందన్నారు. సీత జాడ విన్న కొండగా ఎంతో చారిత్రాత్మక చరిత్ర కలిగిన వినుకొండ కొండను ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి గాంచుతోందని అన్నారు. కొండపై శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణం, ఘాట్ రోడ్, గిరి ప్రదర్శన రోడ్డు నిర్మాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తమ హయాంలో నిర్మాణానికి నోచుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వినుకొండ ప్రజల ఆకాంక్ష మేరకు కొండచెట్టు 1.50 కోట్లతో తారు రోడ్డు వేయటం జరుగుతుందని,



రెండు వైపులా మరో 20 అడుగులు గ్రావెల్ మట్టి రోడ్డు కూడా వేయడం జరుగుతుందన్నారు. అలాగే ఘాట్ రోడ్డు నిర్మాణానికి 12.50 కోట్లు అవసరమని ఇంజనీర్ అధికారులు నివేదించడం జరిగిందని, సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా నిధులు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. త్వరలో ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే తొలితగతిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణం పూర్తవుతుందని వివరించారు. వినుకొండ పట్టణానికి శాశ్వత త్రాగునీటి పథకం ద్వారా 240 కోట్లు నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేశాయని, ఇప్పటికే 30 కోట్లతో పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, మిగిలిన పనులకు ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిందని, త్వరలో పనులు ప్రారంభమై వినకొండకు శాశ్వత త్రాగునీటి పథకం పూర్తి అవుతుందని తెలిపారు. అవసరమైనచోట ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలు చేపడుతున్నారని, పట్టణానికి ప్రతిరోజు త్రాగునీటి సరఫరా అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశంపార్టీకి కార్యకర్తలే వెన్నుముక

**●పార్టీ కార్యకర్తలను ఆదుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా**

**●6లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని పార్టీ కార్యకర్తలను ఆదుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ధవలేశ్వరం గ్రామంలో ఇటీవల ప్రమాదంలో మరణించిన కరణం రామారావు కుటుంబానికి రెండు లక్షల రూపాయలు, దళిత నాయకులు, పౌరోజూ మాణిక్యాలరావు కుటుంబానికి రెండు లక్షల రూపాయలు, అలాగే సాయిబాబా గుడి వద్ద పంపు హౌస్ నిర్మాణంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన కేతమల్ల వెంకటేశ్వరరావు కుటుంబానికి రెండు లక్షల రూపాయలు మొత్తం మూడు కుటుంబాలకు ఆరు లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల వారి నివాసాలకు వెళ్లి కుటుంబసభ్యులకు అందించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... పార్టీకి అనేక సేవలందించిన కార్యకర్తలు మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబాలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, వారు సహృదయంతో స్పందించి ప్రతి కుటుంబానికి రెండు లక్షల రూపాయలు కేటాయించారని వారికి ధన్యవాదాలు తెలిపారు. మృతి చెందినప్పుడు ఇచ్చిన మాట ప్రకారం తన వంతుగా ముఖ్యమంత్రి వారి వద్ద సహాయ నిధిని తీసుకువచ్చానని, రాబోయే రోజుల్లో వచ్చే హౌసింగ్ పథకంలో వారికి ఇల్లు ఇచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెర దించిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



గోపాలపురం (చైతన్యరథం): ద్వారకాతిరుమల మండలం పి. కన్నాపురం నుండి సత్తాల వరకు రూ. 2కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న బీటీ రోడ్డు పనులను గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మండల నాయకులతో కలిసి దగ్గరుండి పరిశీలించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి తమ గ్రామానికి సరైన రహదారి లేదని ఎన్నో ఏళ్లుగా బాధపడుతున్న గ్రామస్తులు, మద్దిపాటి వెంకటరాజు రాకతో తమ ఎన్నో ఏళ్ల రహదారి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంతో గ్రామానికి రాకపోకలు సులభం అవుతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేసిన టీడీపీ యువనేత గద్దె క్రాంతి కుమార్



విజయవాడ (చైతన్యరథం): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ల్యాప్‌టాప్ లేక ఇబ్బంది పడుతున్న నీరుడు కుందన్‌కుమార్ పరిస్థితిని స్థానిక డివిజన్ నాయకులు గద్దె రామమోహన్ దృష్టికి తీసుకెళ్లారని దీనిపై స్పందించిన గద్దె రామమోహన్ విద్యార్థికి లాప్ ట్యాప్ ఇవ్వాలని గద్దె క్రాంతి కుమార్‌కి ఆదేశించడంతో మంగళవారం ఉదయం 2వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గద్దె క్రాంతికుమార్ సదరు విద్యార్థుకి ల్యాప్ ట్యాప్ అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ... విద్యలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పేద విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో బీటెక్ విద్యార్థి నీరుడు కుందన్ కుమార్‌కు సొంత నిధులతో ల్యాప్‌టాప్ అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుత కాలంలో విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమైందని, పేద విద్యార్థులు కూడా ఆధునిక విద్యను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ విద్యా రంగంలో పలు మార్పులు తీసుకువచ్చి విద్యా వ్యవస్థను ఆధునికీకరించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. విద్య ద్వారానే కుటుంబాలు ఉన్నత స్థాయికి చేరుకుంటాయని, సమాజ అభివృద్ధికి కూడా విద్యే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు.

**కార్యకర్తకు పరామర్శ**

2వ డివిజన్ కు చెందిన ఎలిసెల సురేష్ బాబు యాక్సిడెంట్‌కు గురై గాయాలతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకుని పార్టీ కార్యకర్త ఇంటికి గద్దె క్రాంతి కుమార్ వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఏపీలో వ్యవసాయ విద్యాభివృద్ధికి రూ.50.86కోట్లు

**◆లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్రం సమాధానం**



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వక భేటీ అయిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ / న్యూఢిల్లీ (చైతన్యరథం): దేశంలో ఉన్నత వ్యవసాయ విద్యను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా గడిచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.50.86 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో విద్యావిధానం, కేంద్ర ప్రభుత్వ సహకారం, వ్యవసాయ విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలు, 6వ డీన్స్ కమిటీ అమలు పర్యవేక్షణ తదితర విషయాలపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతాంగ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి సమాధానం ఇచ్చారు.

"భారతదేశంలో ఉన్నత వ్యవసాయ విద్య బలోపేతం - అభివృద్ధి" పథకం కింద ఆంధ్ర ప్రదేశ్‌కు రూ.50.86 కోట్ల మేర నిధులు విడుదలైనట్లు మంత్రి తెలిపారు. 2020-21 విద్యాసంవత్సరంలో రూ.12.38 కోట్లు, 2021-22లో రూ.8.20 కోట్లు, 2022 - 23లో రూ.5.78 కోట్లు, 2023 - 24లో రూ.9.02 కోట్లు, 2024 - 25లో రూ.15.48 కోట్లు నిధులు రాష్ట్రానికి విడుదల అయినట్లు వివరించారు. ఆయా నిధులను రాష్ట్రంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పాఠ్య ప్రణాళిక నవీకరణ, డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలు, ప్రయోగశాలల అభివృద్ధి, మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి-2020) కు అనుగుణంగా రూపొందించి 2024 సెప్టెంబర్ 25వ తేదీ నుంచి అమలులోకి తీసుకువచ్చిన ఆరో డీన్స్ కమిటీ సిఫార్సులను ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (గుంటూరు), డా.వైఎస్సార్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయం (వెంకటరామన్నగూడెం), శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం (తిరుపతి), ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ విశ్వవిద్యాలయం (నరసాపురం) విశ్వవిద్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. వ్యవసాయ విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం కల్పించేందుకు పరిశ్రమలతో కలిసి ఇంటర్న్‌షిప్‌లు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్రం వివరించింది. ఈ చర్యల వల్ల విద్యార్థుల ప్లేస్‌మెంట్లు, నైపుణ్యాలు, పరిశోధన ఫలితాలు మెరుగుపడుతున్నాయని కేంద్రం తెలిపింది. ది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్) వెటర్నరీ గ్రాడ్యుయేట్‌కి ప్రోత్సాహకంగా ఇంటర్న్‌షిప్‌ను నెలకు రూ.3,000 చొప్పున ఆరు నెలల పాటు అందిస్తున్నట్లు మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు.

## మౌజాన్, ఇమామ్‌లకు రంజాన్ తోఫా పంపిణీ

**●రెండు వారాల్లో జనాజా వాహనం అందజేస్తాం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో పట్టాభిపురం మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాది ఖానాలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 55 మసీదుల మౌజాన్‌లు, ఇమామ్‌లకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా మౌజాన్‌లు, ఇమామ్‌లకు బట్టలు మరియు అవసరమైన సరుకులను అందజేశారు. ముస్లిం సోదరుల అంత్యక్రియల సమయంలో ఇబ్బంది లేకుండా ఉండటానికి ఒక జనాజా వాహనాన్ని ఇస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... రంజాన్ వంటి పవిత్ర మాసంలో అల్లాహ్ సేవలో నిత్యం గడిపే మౌజాన్‌లు, ఇమామ్‌లకు సహాయం చేయడం ఎంతో సంతోషకరమని, పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరి అభివృద్ధి కోసం తాను రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజల ఆశీస్సులతోనే ఈ స్థాయికి చేరుకున్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మతభేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండడమే నిజమైన ఆనందం, శాంతి అని ప్రతి మతం బోధిస్తుందని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు తమ సమస్యలుగా ఖబరస్తాన్, మసీదు మరియు విద్యాసంస్థల అవసరాలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారం కోసం అధికారులు, కమిషనర్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ మరియు ఇతర అధికారులతో చర్చలు జరుపుతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. త్వరలోనే ఖబరస్థాన్ కోసం తగిన స్థలాన్ని గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే 28వ డివిజన్‌లో ఆడపిల్లల కోసం స్కూల్ ఏర్పాటు చేసే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడించారు.

**ఈ కార్యక్రమంలో శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ఎండీ గళ్ళా రామచంద్రరావు మాట్లాడుతూ...** ముస్లిం సమాజంతో తమకు చిన్ననాటి నుంచే అనుబంధం ఉందని, ఎన్నికల సమయంలో ముస్లిం సోదరులతో ఏర్పడిన అనుబంధం ద్వారా వారి విద్య, వైద్య రంగాలలో ఉన్న అవసరాలు తెలుసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే స్ఫూర్తి

**◆నివాళులర్పించిన మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**




విజయవాడ (చైతన్యరథం): దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు ఘన నివాళి అర్పించారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి కార్యాలయంలో పార్టీ నేతలతో కలసి సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడుతూ, మహిళలను విద్యావంతులుగా చేయాలనే లక్ష్యంతో ఆనాడు సమాజ కట్టుబాట్లను ధిక్కరించి ఆమె చేసిన సాహసం నేటి ఆధునిక మహిళా శక్తికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం మహిళల విద్యకే పరిమితం కాకుండా, పురుషులకన్నా మిన్నగా అవకాశాలను సద్వినియోగం చేసుకునే స్థాయికి మహిళలను తీసుకొచ్చిందని ఉమ తెలిపారు. ఆమె చూపిన దారిలోనే నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. సమాజంలో సగభాగమైన మహిళల విద్యాభివృద్ధిలో సావిత్రిబాయి పూలే కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. అందుకే ఆధునిక మహిళలు ఆమెకు సదా కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మన దేశ మొట్టమొదటి మహిళా టీచర్ అని, స్త్రీ విద్య, హక్కుల సాధన కోసం జీవితాంతం కృషిచేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని సమాజ మార్పునకు శక్తిమంతమైన సాధనంగా భావించారన్నారు. సామాజిక వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగారని, నేటి మహిళా ఉపాధ్యాయులకు ఆమె మార్గదర్శి అని అన్నారు.

## జగన్ ఐదేళ్ల పాలనలో 9.70 లక్షల కోట్ల అప్పులు

**●వాళ్లు చేసిన అప్పులకు ఏటా రూ.71,800 కోట్లు వడ్డీలు కడుతున్న కూటమి ప్రభుత్వం**

**●అధికారం నుంచి దిగిపోయే మూడు నెలల కాలంలో రూ.27,025 కోట్ల మేర అప్పులు చేసిన జగన్**

**●ఆదాయ వనరులపై దృష్టిపెట్టకుండా... బటన్ నొక్కడమే పనిగా ఐదేళ్లు కాలయాపన**

**●కాగ్ నివేదికపై తప్పుడు ప్రచారాన్ని ఖండించిన ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ**



గుంటూరు (చైతన్యరథం): జగన్ ఐదేళ్ల పరిపాలనలో లెక్కకు మించి చేసిన అప్పులకు కూటమి ప్రభుత్వం ఇప్పుడు వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి దాపరించిందని, జగన్ పాలనలో రూ.9.70 లక్షల కోట్ల మేర అప్పులు చేసి ఏమాత్రం ఆదాయ వనరులపై దృష్టిపెట్టకుండా కేవలం బటన్ నొక్కడమే పనిగా ఐదేళ్లు కాలయాపన చేశారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా కూటమి ప్రభుత్వంపై ఏటా రూ.71,800 కోట్ల భారం పడుతోందని, వైసీపీ నిర్వాకంతో బ్యాంకులు సైతం అప్పులు ఇవ్వడం మానేశాయని అన్నారు. తాను చేసిన అప్పుల బురదను కూటమి ప్రభుత్వంపై వేయాలని జగన్‌రెడ్డి ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం కాగ్ నివేదికపై వైసీపీ, సాక్షి మీడియా తప్పుడు రాతలు రాయడం మానుకోవాలని మన్నవ మోహనకృష్ణ పత్రికా ప్రకటనలో హితవు పలికారు.

"వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో సుమారు రూ.9.70 లక్షల కోట్లు అప్పు చేశారు. ఆ అప్పు కూటమి ప్రభుత్వం చేసినట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.81వేల కోట్లు ప్రభుత్వం అప్పు తీసుకుందని కాగ్ నివేదిక ఇస్తే.. వైసీపీ రూ.87 వేల కోట్లుగా ప్రచారం చేస్తుంది. ఆ ఏడాదిలో వైసీపీ మూడు నెలలు అధికారంలో ఉంది. తొలి మూడు నెలల్లో రూ.27,025కోట్లు అప్పు చేసింది. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లో రూ.53వేల కోట్లు అప్పు చేసింది. సాధారణ పరిపాలనకు సైతం ఖజానాలో నిధులు లేకుండా చేసిన ఘనుడు జగన్.

కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రభుత్వ ఉద్యోగులకు రూ.20 వేల కోట్లు చెల్లించింది. వైసీపీ హయంలో ఐదేళ్లలో అమ్మఒడి పథకానికి రూ.26వేల కోట్లు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేయనుంది. సామాజిక పింఛన్ల కోసం జగన్ రూ.58,500 కోట్లు ఖర్చు చేస్తే.. కేవలం ఇరవై నెలల్లోనే రూ.58,654 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. రైతులకు జగన్ ఐదేళ్లలో రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తే.. ఒక్క సంవత్సరంలో రూ.6300 కోట్లు ఇచ్చాం. గతంతో పోల్చితే 45శాతం వరకు అదనపు నిధులు ఇస్తున్నాం. కేంద్ర పథకాలైనా అమృత్, జల్ జీవన్ మిషన్ పథకాలకు రాష్ట్రం నుంచి డబ్బులు ఇవ్వకుండా వాటిని వినియోగించుకోకపోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఒక దిశానిర్దేశం లేని పథకాలను అమలు చేసి ప్రజలను మోసం చేశాడు జగన్. పంచాయతీ గ్రాంట్స్, కేంద్ర ప్రభుత్వ పథకాలను జగన్ పక్కదారి పట్టించారు. తన హయాంలో సర్పంచ్‌ల అధికారాలు తీసి ఇంట్లో కూర్చొబెట్టారు. ఐదేళ్ల రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. ఇప్పుడు అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాడు. జగన్ హయాంలో రాష్ట్రానికి ఒక్క పెట్టుబడైనా వచ్చిందా? వైసీపీ హయాంలో ధాన్యం అమ్మిన ఆరు నెలలు వరకు డబ్బులు జమ అయ్యేవి కావు. నేడు 24 గంటల్లో రైతు అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తున్నాం. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను నాశనం చేశాడు. చింతలపూడి, వెలిగొండ ప్రాజెక్టులను పూర్తి చేస్తే లక్షల రైతులు బాగుపడేవారు. వైసీపీ పాలనలో పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారు. ఇప్పుడు చంద్రబాబు సారథ్యంలో పరిశ్రమలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయి. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. 20 నెలల్లో 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం." అని మోహనకృష్ణ తెలిపారు.

## మహారాష్ట్రలోని కోపేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): మహారాష్ట్రలోని చారిత్రాత్మక కోపేశ్వర దేవాలయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు సందర్శించారు. 12వ శతాబ్దపు అద్భుత శిల్పకళా వైభవానికి నిలయమైన ఈ క్షేత్రంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా నది తీరాన వెలసిన ఈ ప్రాచీన ఆలయ విశిష్టతను, అక్కడి వాస్తు శిల్ప చాతుర్యాన్ని వారు ఈ సందర్భంగా ఆసక్తిగా తిలకించారు. శివుడు కోపంతో ఉన్న సమయంలో ఇక్కడ వెలిశాడని పురాణ గాథలు చెబుతుండటంతో ఈ ఆలయానికి కోపేశ్వర స్వామి ఆలయంగా పేరు వచ్చింది. ఈ దేవాలయంలోని స్వర్గ మండపం, సభామండపం మరియు గర్భాలయంలోని శిల్పకళా నైపుణ్యం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా పైకప్పు లేని స్వర్గ మండపంలోని 48 స్తంభాలపై చెక్కిన సూక్ష్మ శిల్పాలు నాటి కళాకారుల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తాయి. ఆలయ ప్రాంగణమంతా కలియతిరిగిన వెంకట్రావు దంపతులు, ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే ఈ కట్టడాల పరిరక్షణ ఆవశ్యకతను తెలుసుకున్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేయాలి

**●అధికారులకు కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశం**

**●నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలతో సమీక్ష**



కావలి (చైతన్యరథం): రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేయాలని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కావలి నియోజకవర్గ పరిధిలోని ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతుల నమోదు మరియు చెల్లింపులపై స్థానిక ఎమ్మెల్యే మంగళవారం వ్యవసాయ, పౌరసరఫరాలు మరియు రెవెన్యూ శాఖల అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవడంలో ఎటువంటి ఇబ్బందులు పడకూడదని, ప్రతి గింజను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని కావలి మండలములో -6, బోగోలు మండలములో -5, దగదర్తి మండలము -5 మరియు అల్లూరు మండలములో -9 కొనుగోలు వెరశి మొత్తం 25 ధాన్యం కొనుగోలు కేంద్రాలను (పీపీసి/ఆర్ బికే) ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే చెల్లింపుల్లో ఎటువంటి ఆలస్యం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం తేమ వరకు అనుమతించాలని, తేమ ఎక్కువగా ఉన్న సందర్భంలో రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ షీట్లు మరియు డ్రైయింగ్ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ ఏడిలు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సొసైటీల ఛైర్మన్‌లు పాల్గొన్నారు.

# రైతన్నల పాలిట పెద్దన్న ముఖ్యమంత్రి చంద్రన్న

**●విడవలూరు మండల కేంద్రంలో ధాన్య సేకరణ కేంద్రం ప్రారంభం**

**●ధాన్యం విక్రయాల్లో ఏవైనా సమస్యలుంటే 1967 టోల్ ఫ్రీ నంబర్‌తో కంట్రోల్ రూమ్ కాల్ చేయండి**

**●పట్టాదార్ పాస్ పుస్తకాలు మరియు భూసార పరీక్ష పత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

కోవూరు (చైతన్యరథం): రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర దక్కాలన్నదే కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. విడవలూరు మండల కేంద్రంలో ధాన్య సేకరణ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను రైతునే అయినప్పటికీ వ్యవసాయ సంబంధ బాధ్యతలన్నీ ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారే చూస్తారని తనకు రైతు సమస్యలపై అవగాహన కల్పించింది దివంగత మాతూరు శ్రీనివాసులురెడ్డి నన్నారు. గత సంవత్సరం రబి సీజన్ సందర్భంగా ధాన్య సేకరణకు సంబంధించి మాతూరు శ్రీనివాసులురెడ్డి చూపించిన చొరవను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఈ సందర్భంగా మననం చేసుకున్నారు. ధాన్య సేకరణలో తలెత్తే గోనె సంచుల కొరత, ట్రాన్స్ పోర్ట్ తదితర సమస్యలపై జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై అధికారులు మరియు మిల్లర్లతో ఇప్పటికి పలు సార్లు చర్చించడం జరిగిందని రైతులకు అండగా నిలిచి సహాయ సహకారాలు అందించేందుకు అందరూ హామీ ఇచ్చారన్నారు.

ముఖమంత్రి చంద్రబాబునాయుడు రైతుల పాలిట పెద్దన్నలా రైతు సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక అస్తిత్వం కోల్పోయిన సాగునీటి సంఘాల ఏర్పాటు, సాగునీటి కాలువల పూడికతీత లాంటి చర్యలు రైతులకు ఎంతో ఉపయోగ పడ్డాయనన్నారు. రైతులు ధాన్య ఆరబెట్టుకునేందుకు ప్రతి మండలానికి ఒక కళ్ళం ఏర్పాటు చేస్తున్నామని కల్లాల ద్వారా తేమ శాతం లాంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనన్నారు. రైతులు ఎదుర్కుంటున్న తేమ శాతం సమస్యను కలెక్టర్ హిమాన్షు శుక్లా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ నెల 13వ తేది అన్నదాత సుఖీభవ తాలూకు ఆర్థిక సహాయం అందనున్న నేపథ్యంలో ప్రతి రైతు సమీప రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ ఐడిలు చెక్ చేసుకోవాలని పేర్లు లేకుంటే వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టాదార్ పాస్ పుస్తకాలు మరియు భూసార పరీక్షా పత్రాలను



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రైతులకు అందచేశారు. అనంతరం కొడవలూరు గ్రామ పంచాయతీకి సంబంధించి 28 చెత్త తరలించే రిక్షాల ప్రారంభోత్సవంతో పాటు పారిశుధ్య కార్మికులకు 168 డస్ట్ బిన్స్ అందచేశారు. ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారిణి అనితతో పాటు మండల నాయకులు ప్రభుత్వ రైతు సంక్షేమ విధానాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు విడవలూరు మండల తెలుగుదేశం మరియు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాపట్లలో మన వార్డు మన ఎమ్మెల్యే నిర్వహించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

బాపట్ల (చైతన్యరథం): బాపట్ల పట్టణ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన వార్డు - మన ఎమ్మెల్యే' కార్యక్రమం మంగళవారం పునఃప్రారంభమైంది. తమ వార్డుకు స్వయంగా విచ్చేసిన ఎమ్మెల్యేకి ప్రజలు హారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమలో భాగంగా 5వ రోజు బాపట్ల పట్టణంలోని రైలుపేట 4వ వార్డులో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు గల్లీ గల్లీ తిరుగుతూ ప్రజలతో మమేకమైన వారి రోజువారీ ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు మరియు సిమెంట్ రోడ్ల మరమ్మతులపై ప్రజలు ఎమ్మెల్యేకి విన్నవించారు. ప్రజల విన్నపాలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, పర్యటనలో ఉన్న మున్సిపల్ అధికారులను పిలిచి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, ప్రాధాన్యత క్రమంలో తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆశయాల మేరకు, ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే చేర్చడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. వారంలో ప్రతి మంగళవారం ఒక వార్డు చొప్పున పర్యటించి, పట్టణంలోని ప్రతి సమస్యను పరిష్కరించే వరకు విశ్రమించబోమని స్పష్టం చేశారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా, చేతల్లో అభివృద్ధిని



చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, యూనిట్ ఇన్ ఛార్జ్ పరిశా రమేష్ గౌడ్, వార్డ్ ప్రెసిడెంట్ అద్దంకి సోమ శేఖర్, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్వేపల్లిలో సందడిగా సాగుతోన్న సైకిళ్ల పంపిణీ

**●రెండో రోజు మనుబోలులో 257 సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి**

**●పాల్గొన్న ఏపీ ఆక్వా అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి**



సర్వేపల్లి (చైతన్యరథం): ప్రతి బిడ్డా కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఏపీ ఆక్వా అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని మనుబోలులోని జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ పొన్నూరు రామకృష్ణయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, కనుపూరు కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వర్దినేని మస్తాన్‌నాయుడు, నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, శివుని రాజాగౌడ్, మండల అధికారులతో కలిసి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... SEIL కంపెనీ విద్యార్థినుల కోసం 1841హీరో సైకిళ్లను అందజేయడం జరిగిందని, మొదట విడతగా 8, 9 తరగతుల విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్నామని, నారా లోకేష్‌బాబు యువగళం స్ఫూర్తితో ఆయన నడిచిన కిలోమీటర్లకు గుర్తుగా 3,132 సైకిళ్ల పంపిణీని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. CEO జన్మేజయ మహాపాత్ర సహకారంతో అందుతున్న సైకిళ్లు పోను మిగిలిన వాటి పంపిణీకి కూడా సన్నాహాలు చేస్తున్నాం. సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులను కూడా వినియోగించుకుంటున్నాం. తల్లికి వందనం పథకంతో స్కూలుకు వచ్చే గిరిజన బిడ్డల సంఖ్య పెరిగి డ్రాపవుట్లు తగ్గాయి. విద్యాలయాల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద మనుబోలు హైస్కూలు మైదానంలో క్రీడావసతుల కల్పనకు రూ.45 లక్షల కోసం ప్రతిపాదనలు పంపాం. SEIL కంపెనీ సీఎస్ఆర్ నిధులతో మన నియోజకవర్గానికి అన్ని విధాలుగా సహకరిస్తోంది. వెంకటాచలం, పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రూ.1.80 కోట్లతో పరికరాలు అందించింది. బ్రహ్మదేవంలో రూ.20 కోట్లతో ఆస్పత్రి నిర్మించబోతోంది...ఈ ఆస్పత్రిలో అన్ని వైద్యసేవలు, మందులు, చికిత్సలు ఉచితంగా అందబోతున్నాయి. నర్సింగ్ కళాశాల కూడా ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నారు. మల్లికార్జునపురంలో 280 కుటుంబాలను దత్తత తీసుకుని, వారి అభ్యున్నతికి పాటుపడుతోంది. అదానీ ఫౌండేషన్ ముత్తుకూరు, కృష్ణపట్నం పంచాయతీలను దత్తత తీసుకుని కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతోంది. కృష్ణపట్నంలోని తుఫాన్ షెల్టర్ ను స్కిల్ డెవలప్మెంట్ సెంటరుగా మార్చుతున్నాం. ప్రవాస భారతీయులైన ప్రేమసాగర్ రెడ్డి తమ సొంతూరు నిడిగుంటపాళెంలో 14 గదులతో నిర్మించిన భవనం లోనూ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నాం. పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో అనేక రకాలుగా కార్యక్రమాలు చేపడుతున్నాం.. దుస్థితిలో ఉన్న హాస్టళ్లలో మరుగుదొడ్ల తదితర వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయించాం. బీసీ హాస్టల్ భవన నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరయ్యాయి. విద్యార్థులు ఈ వసతులన్నింటిని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్ పొందాలి. తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి. అని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు.

## వివక్ష లేని సమాజం కోసం సావిత్రిబాయి బాటలో నడుద్దాం!

**●నివాళులర్పించిన చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య**




చీరాల (చైతన్యరథం): వివక్ష లేని సమాజం కోసం సావిత్రిబాయి బాటలో నడుద్దామని, భారతదేశ చరిత్రలో అణచివేతకు వ్యతిరేకంగా, వివక్ష లేని సమాజం కోసం అక్షరాన్నే ఆయుధంగా మలిచిన తొలి తరం విప్లవకారిణి సావిత్రిబాయి పూలే అని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య వ్యాఖ్యానించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేవలం ఒక ఉపాధ్యాయురాలిగా మాత్రమే కాకుండా, మనువాద పితృస్వామ్య భావజాలాన్ని ధిక్కరించిన సామాజిక యోధురాలిగా ఆమె చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. సావిత్రిబాయి పూలే 1831, జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా, నైగావ్ అనే గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించారు. ఆ కాలపు ఆచారాల ప్రకారం, ఆమెకు 9 ఏళ్ల వయసులోనే 13 ఏళ్ల జ్యోతిరావు పూలేతో వివాహం జరిగింది. అక్షరం ముక్క రాని స్థితిలో అత్తగారింట్లోకి అడుగుపెట్టిన సావిత్రిబాయికి, ఆమె భర్త జ్యోతిరావు పూలే తొలి గురువై విద్యను నేర్పించారు. 1848లో పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి, భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. అంటరానితనం పేరిట విద్యకు దూరమైన దళిత, శూద్ర వర్గాల కోసం ఆమె విద్యా సంస్థలను స్థాపించి, జ్ఞానాన్ని సామాన్యుడి దరికి చేర్చారు. ఆమె పోరాటం కేవలం విద్యకే పరిమితం కాలేదు. సమాజంలోని కుళ్లును కడిగేయడానికి ఆమె అనేక సంస్కరణలు చేపట్టారని అన్నారు.

# పెద్ద మనసు చాటుకున్న మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

- రెండు నెలల క్రితం హామీ, నేడు రూ.2లక్షలతో షాపు ప్రారంభం
- చెప్పులు కుట్టుకునే పేదవాడిని షాపు యజమానిగా చేసిన ఎం.ఎస్.రాజు



మడకశిర (చైతన్యరథం): నియోజకవర్గ శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు మరియు శ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు ఎవరికైనా మాటిచ్చారంటే.... అది శిలాశాసనమే అంటున్నారు మడకశిర ప్రజలు. పేదవారి కష్టాలు చూస్తే వాటిని పరిష్కరించేందుకు ఎంత దూరమైనా ఎం.ఎస్.రాజు వెళతారని, ఇలాంటి నాయకుడిని మడకశిర గడ్డ ఏనాడూ చూడలేదని తమ ఎమ్మెల్యేని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. అన్నా.... ఇదీ సమస్య అంటే జేబులో ఎంత డబ్బులుంటే అంత ఇచ్చేయడం... అతితక్కువ సమయంలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం, మడకశిర ప్రజలకు, కష్టాలకు మధ్య అడ్డుగోడలా తమ ఎమ్మెల్యే నిలిచిపోతున్నారని, ఇలాంటి ఎమ్మెల్యేను పంపించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువమంత్రి నారా లోకేష్‌కి జీవితాంతం రుణపడి ఉంటామని మడకశిర ప్రజలు అంటున్నారు. ఇంతకీ మడకశిరలో తాజాగా ఏం జరిగిందంటే....

2 నెలల క్రితం మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మడకశిర పట్టణంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో మడకశిర పట్టణం, అంబేద్కర్ సర్కిల్ వద్ద రోడ్డు ప్రక్కన ఎర్రటి ఎండలో చెమటలు కక్కుతూ కష్టపడుతున్న ఓ వ్యక్తిని ఎం.ఎస్.రాజు తన చుట్టూ ఉన్న జనం మధ్యలో నుండి గమనించారు. వెంటనే ఆ చెప్పులు కుట్టుకునే వ్యక్తి వద్దకు వెళ్లి అతని వద్ద క్రింద కూర్చున్నారు. అతని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెప్పులు కుట్టే వ్యక్తి పేరు రామాంజి. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నిరుపేద. రోడ్డు ప్రక్కన ప్రతిరోజూ చెప్పులు కుడితే వచ్చే కొద్దీ, గొప్ప ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దయనీయ పరిస్థితి. తన కష్టాన్ని ఎం.ఎస్.రాజుకి రామాంజి పూర్తిగా వివరించాడు. రామాంజి చెప్పిన విషయాలు విన్న ఎం.ఎస్.రాజు చలించిపోయారు. దళితుల్లో ఇంకా ఇలాంటి వ్యక్తులు ఉన్నారు, ఇలాంటి వారికి చేయూతనిచ్చి వారి కుటుంబాలను నిలబెట్టాలని సంకల్పించారు. రామాంజికి త్వరలోనే ఒక షాపు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. అంతే...సరిగ్గా నేటికి 2నెలలు. ఈరోజు మడకశిర అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏ ప్రాంతంలో అయితే రామాంజి రోడ్డు ప్రక్కన ఎండలో కష్టపడే వాడో.... దాని సమీపంలోనే ఒక చెప్పుల షాపును ఎం.ఎస్.రాజు తన సొంత నిధులు రూ. 2లక్షలు ఖర్చు చేసి తన చేతులు మీదుగా రిబ్బన్ కట్ చేసి రామాంజికి అప్పజెప్పారు. రామాంజి, తన కుటుంబ సభ్యులు తమకు సాయం చేసిన ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు చెప్పి భావోద్వేగానికి గురయ్యారు. తమకు ఇంత సాయం చేసిన ఎమ్మెల్యేకి చిరు కానుకగా...... రామాంజి వద్ద చెప్పులు కుట్టే ప్రదేశంలో ఎమ్మెల్యే క్రింద కూర్చున్న ఫోటోను ఫ్రేమ్ కట్టించి ఎమ్మెల్యేకు ఇచ్చి మురిసిపోయారు. రామాంజికి ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు చేసిన సాయం గురించి మడకశిర పట్టణంతో పాటు నియోజకవర్గం మొత్తం దావాగ్నిలా వ్యాపించింది. తమ ఎమ్మెల్యే మనసున్న మారాజు అని.... మడకశిరకు రారాజు అని మడకశిర నియోజకవర్గ ప్రజలు తమ ఎమ్మెల్యే గురించి చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుగారు ప్రతి ఇంటి నుండి ఒక ఎంటర్ ప్రెన్యూర్ రావాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో.... ఒక చెప్పులు కుట్టుకునే రామాంజిని.... ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఒక షాపుకు యజమానిని చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు కలను నెరవేర్చారు. నాయకుడు అంటే నోటికొచ్చిన మాటలు ఇవ్వడం... అధికారంలోకి వచ్చాక వాటిని మరచిపోవడం... ఇచ్చిన మాట ఏమైంది అని అడిగితే అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడం కాదు. మాట ఇస్తే ఆ మాటను నిలబెట్టుకోవడం అని ఎం.ఎస్.రాజు నిరూపించారు. మడకశిర ప్రజలందరి చేత శభాష్ అనిపించుకున్నారు.

# శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు



ఒంగోలు (చైతన్యరథం): ఒంగోలు నగరంలోని ఏఎంసీ ప్రాంగణం నందు ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని, వైసీపీ హయాంలో ధాన్యం బకాయిలు పెట్టారని దీంతో ఎంతో మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొారని, కానీ కూటమి ప్రభుత్వంలో పంట కొనుగోలు చేసిన వెంటనే రైతులకు డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు.

# గరుడ వారధిపై బైక్‌లు భారీ వాహనాలు నిషేధం

- వారధిపై పెరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో తిరుపతి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం
- ప్రజల భద్రతకే తమ తొలి ప్రాధాన్యమని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు వెల్లడి



తిరుపతి (చైతన్యరథం): తిరుపతిలోని వాహనదారులకు అలర్ట్.. గరుడ వారధిపై రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా తిరుపతి గరుడ వారధిపై ఇక మీదట ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు. తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ సంయుక్త సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తిరుపతి స్మార్ట్ సిటీ అమలులో మంగళవారం రోజున తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీసుబ్బరాయుడు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఇతర విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ఈ క్రమంలోనే తిరుపతి గరుడ వారధిపై జరుగుతున్న ప్రమాదాల గురించి చర్చించారు. గరుడ వారధి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల వివరాలను పరిశీలించి ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రజాభద్రతే ప్రాధాన్యంగా గరుడ వారధి పై ద్విచక్ర, భారీ వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించారు. ప్రజల భద్రత దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని తిరుపతి జిల్లా యంత్రాంగం ప్రజలకు సూచించింది. ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరింది. అలా కాదని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు హెచ్చరించారు.

**వడమాలపేట వద్ద ప్రమాదం**

మరోవైపు తిరుపతి జిల్లా వడమాలపేట అంజేరమ్మ కనుమ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆలయం వద్ద ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును కారు ఢీకొట్టింది. ఆ కారును వెనుకనే వస్తున్న మరో కారు ఢీకొట్టింది. చెన్నై నుంచి తిరుపతి వైపు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో కారులోని వారికి స్వల్పగాయాలయ్యాయి. అయితే పెను ప్రమాదం తప్పటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు జాతీయ రహదారిపై ప్రమాదంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# కదిరి రథోత్సవంలో అపశ్రుతి... ఐదుగురికి గాయాలు



శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవంలో (తేరు) అపశ్రుతి చోటుచేసుకుంది. రథోత్సవంలో భాగంగా రథం లాగే క్రమంలో రథం చక్రం కింద పడి ఓ వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. అతన్ని కాపాడేందుకు ప్రయత్నించిన మరో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఆలయ అధికారులు, సిబ్బంది వెంటనే గాయపడిన వారందరిని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కదిరి ప్రభుత్వాసుపత్రిలో ప్రస్తుతం వీరికి చికిత్స కొనసాగుతోంది.

కదిరిలోని శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన బ్రహ్మరథోత్సవం మంగళవారం నిర్వహించారు. వేలాదిమంది భక్తజన సందోహం మధ్యన వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. బ్రహ్మరథోత్సవంలో భాగంగా ఉదయం ఎనిమిది గంటల 40 నిమిషాలకు ఆలయ అర్చకులు స్వామివారికి నిత్యకైంకర్యాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల నడుమ రథం ముందుకు కదిలింది. ఈ కార్యక్రమానికి పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. రథోత్సవంలో భాగంగా స్వామివారు రథంలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు దవనం, మిరియాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. రథంలో ఆసీనుడైన నరసింహస్వామిపై దవనం, మిరియాలు చల్లితే పాపాలు తొలగి అష్టఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే అధిక సంఖ్యలో భక్తులు కదిరి బ్రహ్మరథోత్సవానికి హాజరవుతుంటారు. దీంతో ఈ కార్యక్రమం కోసం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఫిబ్రవరి 27వ తేదీన అంకురార్పణంతో ఖాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. 15 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. మార్చి 11వ తేదీ అశ్వవాహన సేవ నిర్వహిస్తారు. మార్చి 12న తీర్థవాది ఉత్సవం జరుగుతుంది. మార్చి 13వ తేదీన పుష్పయాగోత్సవంతో కదిరి బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి.

# మార్చి 13న పీఎం కిసాన్ నిధుల విడుదల

ఆంధ్రప్రదేశ్ రైతులకు ముఖ్య గమనిక. అన్నదాత సుఖీభవ పథకం నిధుల విడుదలకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. అన్నదాత సుఖీభవ పథకాన్ని, కేంద్ర ప్రభుత్వం పథకమైన పీఎం కిసాన్ యోజన తో కలిపి అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ యోజన పేరుతో ప్రతి ఏటా ఏపీలోని అర్హులైన రైతులకు 20 వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 14000, పీఎం కిసాన్ యోజన కింద రూ. 6000 అందిస్తున్నారు. మొత్తం మూడు విడతల్లో ఈ నిధులను రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే పీఎం కిసాన్ యోజన 22వ విడత నిధుల విడుదలకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. మార్చి 13వ తేదీన పీఎం కిసాన్ యోజన 22వ విడత నిధులు విడుదల చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా మార్చి 13వ తేదీన అస్సాంలోని గౌహతిలో జరిగే కార్యక్రమంలో పీఎం కిసాన్ యోజన 22వ విడత నిధులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. మరోవైపు కేంద్రం పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల చేసిన రోజే.. ఏపీ ప్రభుత్వం కూడా అన్న దాత సుఖీభవ పథకం నిధులు విడుదల చేస్తుంది. ఈ నేపథ్యంలో మార్చి 13వ తేదీనే అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు కూడా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసే అవకాశాలు ఉన్నాయి. పీఎం కిసాన్ యోజన కింద రూ. 2000, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 4000 కలిపి అర్హులైన రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 6000 జమయ్యే అవకాశం ఉంది. ఉగాదికి ముందు ఈ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. మరోవైపు పీఎం కిసాన్ యోజన సాయం అందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయశాఖ మరోసారి స్పష్టం చేసింది. పీఎం కిసాన్ లబ్ధి అందుకోవటానికి రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలని.. ఇందుకోసం సమీప సీఎస్‌సీ కేంద్రాలను సంప్రదించాలని సూచించింది. ఓటీపీ ఆధారిత ఈకేవైసీ కోసం పీఎం కిసాన్ సైట్ సందర్శించవచ్చు. లేదా బయోమెట్రిక్ ఆధారంగా ఈకేవైసీ చేయాలంటే కామన్ సర్వీస్ సెంటర్లను సంప్రదించాలని కేంద్ర వ్యవసాయ శాఖ సూచించింది.

ప్రవాసాంధ్ర
NRI TDP
చైతన్యరథం



# ఉల్లాసంగా... ఉత్సాహంగా...

- అట్లాంటాలో అంబరాన్నంటిన మహిళా దినోత్సవ సంబరాలు
- వాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో 'గోల్డెన్ వెన్యూ'లో వేడుకలు

అట్లాంటా (జార్జియా): అమెరికాలోని అట్లాంటాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. వాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో కమింగ్ నగరంలోని 'గోల్డెన్ వెన్యూ'లో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కేవలం మహిళల కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది తెలుగు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు:** కార్యక్రమం ఆద్యంతం వినోదభరితంగా సాగింది. ప్రఖ్యాత యాంకర్ శిరీష తన చమత్కారంతో, ఉత్సాహభరితమైన వ్యాఖ్యానంతో సభికులను అలరించారు. వేదికపై నిర్వహించిన ఫ్యాషన్ షో, మహిళల ర్యాంప్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్సాహభరితమైన ఆటలు, పాటలు, డ్యాన్స్ ఫ్లోర్ సందడితో ప్రాంగణం మార్మోగింది. ర్యాఫిల్ డ్రా విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.



**ఆరోగ్యంపై అవగాహన:** ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ వైద్యులు డాక్టర్ నందిని సుంకిరెడ్డి, డాక్టర్ దీప్తి తల్లూరి, డాక్టర్ భవాని మెరుగు మహిళల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి కీలక సూచనలు చేశారు. మారుతున్న జీవనశైలిలో మహిళలు తమ శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అతిథులందరికీ రుచికరమైన సాత్విక ఆహారంతో విందు ఏర్పాటు చేశారు.



**సేవా కార్యక్రమాలే లక్ష్యం:** ఈ సందర్భంగా వాసవి సేవా సంఘం మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ.. సంస్థ తరపున ఏడాది పొడవునా సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకను ఇంతటి ఘన విజయవంతం చేసినందుకు ఈవెంట్ స్పాన్సర్లకు, ర్యాఫిల్ దాతలకు, వలంటీర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వందన సమర్పణతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి.









## సౌదీ నుంచి క్షేమంగా బయలుదేరిన...

# 59 మంది తెలుగు పౌరులు

### మంత్రి లోకేష్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఏపీఎన్ఆర్టీ, ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు

బహ్రెయిన్: ఇజ్రాయిల్–ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్‌లో చిక్కుకున్న 59 మంది తెలుగు ప్రజలు ఏపీఎన్ఆర్టీ, ఎన్ఆర్ఐ టీడీపీ సంయుక్త సహకారంతో మంగళవారం రాత్రి క్షేమంగా బయలుదేరారు. సౌదీ అరేబియా దమ్మాం ఎయిర్ పోర్టు నుంచి వారు విమానంలో పయనమయ్యారు. యుద్ధం కారణంగా తాత్కాలికంగా నిలిచిన విమానాల రాకపోకలు పాక్షికంగా పునః ప్రారంభమైన నేపథ్యంలో... గత 10 రోజులుగా బహ్రెయిన్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో చిక్కుకున్న 59 మంది అక్కడి నుంచి సురక్షితంగా బయలుదేరారు.



అక్కడ చిక్కుకున్న వారి పరిస్థితి మొదట బహ్రెయిన్‌లోని ఏపీ నాన్–రెసిడెంట్ తెలుగు సొసైటీ (APNRTS), ఎన్ఆర్ఐ టీడీపీ విభాగానికి తెలిసింది. వెంటనే వారు అధికారులకు సమాచారం అందించి తక్షణ సహాయం కోరారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ భవన్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ఏపీఎన్ఆర్టీ చైర్మన్ వేమూరి రవికుమార్, సీఈవో కృష్ణమోహన్ రంగంలోకి దిగి ఆయా దేశాల్లోని గుడ్‌విల్ రాయబారులను అప్రమత్తం చేశారు.

గల్ఫ్ కౌన్సిల్ టీడీపీ ఎన్ఆర్ఐ విభాగ అధ్యక్షుడు రావి రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో కూడిన ఆరు గల్ఫ్ దేశాల్లో ప్రస్తుతం సుమారు 100 మంది ఏపీఎన్ఆర్టీఎస్ గుడ్‌విల్ రాయబారులు చురుకుగా పనిచేస్తున్నారు. ఈ వాలంటీర్లు ఖతార్, కువైట్, బహ్రెయిన్ నుంచి సౌదీ అరేబియాకు వెళ్లాల్సిన తెలుగు వారికి ట్రాన్సిట్ వీసాల జారీకి సహకారం అందించారు. 'సౌదీ అరేబియాలోని దమ్మాం నుంచి విమానాలు ప్రస్తుతం నడుస్తున్నాయి. వారికి స్థానిక రవాణాను కూడా ఏర్పాటు చేశాం. చిక్కుకున్న ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకోవడానికి వ్యక్తిగత వాహనాలు, ఇతర లాజిస్టిక్ సపోర్ట్ అందించాము' అని రాధాకృష్ణ చెప్పారు.

తెలుగు పౌరులను సురక్షితంగా తరలించడానికి బహ్రెయిన్ టీమ్ సభ్యులు రఘునాథ్‌బాబు, హరిబాబు, శివకుమార్, సతీష్ షెట్టి, మోహన్, సతీష్ బోళ్ళ, జగదీష్, బాలకృష్ణ, సౌదీ టీమ్ సభ్యులు ఖలీద్, సైఫుల్లా, జానీ షేక్, రంజిత్, ముజామిల్, జాకీర్, సారథి సహకారం అందించారు. తాము క్షేమంగా స్వస్థలాలకు వెళ్లడానికి సహకారం అందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, ఏపీఎన్ఆర్టీ టీమ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత రాయబారులు, బహ్రెయిన్, సౌదీ ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులకు సౌదీ నుంచి బయలుదేరిన తెలుగు పౌరులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొలంబస్‌లో 'తానా' వాలీబాల్ పోటీలు

### హోరాహోరీగా ఓహియో వ్యాలీ ప్రాంతీయ టోర్నమెంటు

కొలంబస్ (ఓహియో): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో ఓహియో వ్యాలీ ప్రాంతీయ వాలీబాల్ టోర్నమెంటు కొలంబస్‌లో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. స్థానిక తెలుగు యువత, క్రీడాకారులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్రీడా పండుగను విజయవంతం చేశారు. తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు నేతృత్వంలో దేశవ్యాప్తంగా తానా క్రీడా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. జాతీయ క్రీడా సమన్వయకర్త శివ చావ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ టోర్నమెంటును ఓహియో వ్యాలీ ప్రాంతీయ ప్రతినిధి ప్రదీప్ చందనం సమన్వయం చేసి దిగ్విజయంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మాజీ ప్రాంతీయ ప్రతినిధి శ్రీనివాస్ సంగ, శివ చావ, నాగేశ్వరరావు మన్నె, వీర ప్రతాప్, శ్రీకాంత్‌రెడ్డి చింతపల్లి, మనోజ్ సిరిగిరెడ్డి, చందు గుమ్మళ్ళ, శ్రీకుమార్ కాసా, రాఘవ శ్రీహరి, సురేష్ పార్వతి, రాజేష్, వీరేష్ విల్లిగడ్ల, శ్యామ్ దుద్దెల, విప్పల రెడ్డి, యష్ కోసన, తేజ తదితరులు హాజరై క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపారు.









**హోరాహోరీగా సాగిన పోటీల్లో గెలుపొందిన జట్లు:**

డివిజన్–1 విజేత: నైట్ ఫ్యూరీ – కెప్టెన్: ప్రకాష్ కటకం.
డివిజన్–1 రన్నరప్: క్లీవ్‌ల్యాండ్ సెట్టర్స్ – కెప్టెన్: బాల నెత్తెం.
డివిజన్–2 విజేత: కేఎంఏ – కెప్టెన్: హర్ష పొలవరపు.
డివిజన్–2 రన్నరప్: వాలీ ఏసెస్ – కెప్టెన్: రాంబాబు.

విజేతలకు ఆంధ్ర పీపుల్ ఆఫ్ సెంట్రల్ ఓహియో (APCO) వ్యవస్థాపక సభ్యుడు నాగేశ్వరరావు మన్నె, మాజీ అధ్యక్షురాలు వాణి గజ్జె ట్రోఫీలను అందజేశారు.

కార్యక్రమంలో సాయిబాబా దేవాలయం బోర్డు చైర్మన్ తేజో వట్టి, వేంకటేశ్వర దేవాలయం అధ్యక్షుడు వెంకట్ కుసుమంచి కూడా పాల్గొన్నారు.

ఐక్యతకు వేదిక: ఏపీసీఓ (APCO) మాజీ అధ్యక్షుడు సుధాకర్ అలవాల, కమ్యూనిటీ నాయకులు శ్రీనివాస్ బొడ్డు, భరత్ జటప్రోలు తమ మద్దతు అందించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ప్రతినిధి ప్రదీప్ చందనం మాట్లాడుతూ.. టోర్నీ విజయానికి సహకరించిన 'తానా' కేంద్ర నాయకత్వానికి, సత్య నిమ్మల, శ్రీనివాస్ సంగలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్నేహభావం, ఐక్యత, క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా 'తానా' చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు అమెరికాలోని తెలుగు సమాజాన్ని మరింత దగ్గర చేస్తున్నాయని నిర్వాహకులు చెప్పారు.

# ఎల్పీజీ కొరత లేదు!



- దేశంలో 10శాతం ఉత్పత్తి పెరిగింది
- స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వ వర్గాలు
- చమురు ధరలపై ప్రధాని మోదీ సమీక్ష



దేశంలో ఎల్పీజీ కొరత లేదని, సరఫరాను స్థిరీకరించామని మంగళవారం కేంద్ర ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా దేశంలో పలు హోటళ్లు. రెస్టారెంట్లు మూతపడినట్టు వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల నేపథ్యంలో కేంద్రంనుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి రిఫైనరీలు ఎల్పీజీ ఉత్పత్తిని 10శాతంమేర పెంచాయని పేర్కొన్నాయి. కృత్రిమ కొరతను నిరోధించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపాయి. "ఎల్పీజీ సరఫరా విషయంలో సమస్యలను అర్థం చేసుకునేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలు వివిధ రెస్టారెంట్ అసోసియేషన్లతో మాట్లాడుతాయి. ఇందుకోసం ఐఓసీ, హెచ్పీసీఎల్, బీపీసీఎల్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో ఇప్పటికే కమిటీ ఏర్పాటైంది. హోటళ్లు, రెస్టారెంట్ల అవసరాలకు తగ్గట్టుగా కమిటీ సరఫరాకు ప్రాధాన్యతనిస్తుంది. అలాగే కొన్నిరోజుల వ్యవధిలోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి 10శాతంమేర పెరిగింది. ఎల్పీజీ, ఎల్ఎన్జీ కన్‌సైన్‌మెంట్ కూడా వచ్చే అవకాశం ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో మనం గతంలో సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొన్నాం కానీ.. ఇప్పుడు అలాంటివి ఏమీ లేవు. ఇరాన్–ఇజ్రాయెల్ ఘర్షణకు ముందువలే భారత రిఫైనరీలు పూర్తిసామర్థ్యంతో నడుస్తున్నాయి. మన ముడిచమురు దిగుమతుల్లో 70 శాతం హర్మూజ్ జలసంధినుంచి కాకుండా ఇతర వనరులనుంచి సమకూరుతున్నాయి. ఇక సంక్షోభం తర్వాత ఇతర దేశాలకంటే మనమే మెరుగ్గా కోలుకుంటాం. అంతేగాకుండా శుద్ధిచేసిన చమురు ఎగుమతులను నియంత్రించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు" అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబయిలో 20శాతం హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడ్డాయని హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రెండురోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడతాయని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఒక్కో వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతమున్న 21 రోజులనుంచి 25 రోజులకు పెంచింది. అలాగే చమురు సంస్థలపై నిత్యావసర సరకుల చట్టాన్ని ప్రయోగించింది.

**చమురు ధరలపై ప్రధాని సమీక్ష**

చమురు ధరల పెంపు భయం ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నవేళ కేంద్రం అప్రమత్తమైంది. ఈమేరకు కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితోపాటు, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. మంగళవారం ఉదయం వీరి భేటీ జరిగింది. ఇరాన్–ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం, చమురు సంక్షోభం, ధరల నియంత్రణ, చమురు నిల్వలు, సరఫరావంటి అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఎల్పీజీ ధరల పెరుగుదలపై చర్చించినట్టు సమాచారం. ఈ సందర్భంగా దేశంలో చమురు ధరల నియంత్రణపై, గృహ వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ఒక వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం దేశాన్ని చమురు ధరల అంశం కలవరపెడుతోంది. ఇరాన్ యుద్ధం, గల్ఫ్ దేశాలపై దాడులు, హోర్ముజ్ జలసంధి మూసివేతవంటి కారణాలతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. ఇండియాలో కూడా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీవంటి గ్యాస్ ధరలు భారీగా పెరుగుతాయనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఎల్పీజీ ధరలు స్వల్పంగా పెరిగాయి. వాణిజ్య సిలిండర్ల వినియోగంపై ఆంక్షలు మొదలయ్యాయి. డిమాండ్‌కు సరిపడా ఇరాన్ యుద్ధం ఇంకా కొనసాగితే ఈ ధరలు మరింత పెరిగే అవకాశముంది. దీంతో ప్రజలపై ఆర్థిక భారం పెరిగే అవకాశం ఉంది. ఇండియా తన చమురు అవసరాల కోసం ఎక్కువగా విదేశీ దిగుతులపైనే ఆధారపడుతుంది.

# 13న రైతు ఖాతాలకు పీఎం-కిసాన్ సొమ్ములు



**రూ.2వేల చొప్పున 9.32కోట్ల ఖాతాలకు జమ**

ఢిల్లీ: రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం– కిసాన్ నిధులు మార్చి 13న విడుదల కానున్నాయి. ఈ పథకం కింద 22వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.32 కోట్లమంది రైతుల ఖాతాల్లో రూ.2 వేలు చొప్పున జమ కానున్నాయి. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో నిధులను విడుదల చేయనున్నట్టు వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పీఎం–కిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6వేలు రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. ఈ దఫా మొత్తం రూ.19 వేల కోట్ల నిధులను విడుదల చేయనున్నారు.

# 'అఫ్గాన్‌పై వైమానిక దాడులు అన్యాయం'



పాకిస్థాన్– అఫ్గానిస్థాన్ మధ్య సరిహద్దు ఘర్షణలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో అఫ్గాన్‌పై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ పేర్కొన్నారు. 'సరిహద్దుల్లో జరిగే హింస కారణంగా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై సెక్రటరీ జనరల్ ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మానవతా వాదం, అంతర్జాతీయ చట్టాలను బాధ్యతాయుతంగా పాటించాలి. పౌరుల రక్షణకు చర్యలు చేపట్టాలనే సెక్రటరీ జనరల్ పిలుపునకు మా మద్దతును పునరుద్ఘాటిస్తున్నాం' అని హరీష్ అన్నారు. ఈ సందర్భంగా అఫ్గాన్ భూభాగంపై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇవి అంతర్జాతీయచట్టాలతో పాటు ఆ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు. ఇక, ఇరుదేశాలు సంయమనం పాటించాలని పలు దేశాలు పిలుపునిచ్చినప్పటికీ.. పాక్–అఫ్గాన్ మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సరిహద్దు ఆపరేషన్లో అనేకమంది శత్రు సైనికులను హతమార్చామని ఇరువర్గాలు ప్రకటించాయి. ఇదిలాఉండగా.. అఫ్గాన్ సరిహద్దులోని ఉత్తర వజీరిస్తాన్‌లో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఘటనలో ఒకరు మరణించగా.. 18మంది గాయపడ్డారు.

# ప్రశ్నించే సాహసం చేయకండి

**పిటీషనర్లపై అత్యున్నత న్యాయస్థానం ఫైర్**

ఢిల్లీ: జ్యుడిషియల్ అధికారులను ప్రశ్నిస్తూ.. పిటిషన్ దాఖలు చేసిన పలువురిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్ ప్రక్రియలో తొలగించిన ఓటర్ల వివరాలు వెరిఫై చేసేందుకు అత్యున్నత న్యాయస్థానం నియమించిన జ్యుడిషియల్ అధికారులపై అనుమానాలు వ్యక్తం చేయడాన్ని తప్పుబట్టింది. అప్పీళ్లను పరిశీలిస్తున్న అధికారులను ప్రశ్నించే ధైర్యం చేయొద్దని హెచ్చరించింది. అధికారులు ఇప్పటికే ఓవర్ టైం పని చేస్తున్నారని.. వారిని ఇంకేం చేయమంటారని అసహనం వ్యక్తం చేసింది. వారిపై ఫిర్యాదులు చేస్తే సహించబోమంది. పేర్ల తీసివేతపై అభ్యంతరం తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించలేదని ఆరోపిస్తూ.. దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రజల అప్పీళ్లను పరిశీలిస్తున్న జ్యుడిషియల్ అధికారులకు తగిన సాయం, లాజిస్టికల్ మద్దతు అందించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ బెంగాల్ ప్రభుత్వాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించారు. సర్ ప్రక్రియలో పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా వస్తున్న అప్పీళ్లను విచారించడానికి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులతో కూడిన అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జ్యుడీషియల్ అధికారులు తిరస్కరించిన ఓటర్ల అభ్యంతరాలను నూతన ట్రైబ్యునల్ పరిశీలిస్తుందని తెలిపారు.

# అర్హత కలిగిన ఓటర్లను జాబితానుంచి తొలగించం

**- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ స్పష్టీకరణ**



అర్హత కలిగిన ఓటర్లను జాబితానుంచి తొలగించే ప్రసక్తే ఉండదని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. సీఈసీ బృందం అక్కడ పర్యటించింది. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశాల అనంతరం సీఈసీ మీడియాతో ముచ్చటించారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహణే తొలి ప్రాధాన్యంగా వివరించారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఓటర్ల పేర్లు ఎప్పటికీ తొలగించబోమని స్పష్టంచేశారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాల్లో 'ప్రత్యేక సమగ్ర సవరణ' అమలవుతుందన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటం, అర్హులైనవారి పేర్లు జాబితాలో ఉండేలా చూడటమే 'సర్' బాధ్యతగా వివరించారు. ఇక్కడ ఎన్నికలు ఎన్ని దశల్లో జరుగుతాయనేది రాష్ట్ర ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో చేపట్టే చర్యలపైన ఆధారపడి ఉంటుందన్నారు. బెంగాల్ ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఓటర్లపైనా, ఎన్నికల అధికారులపైనా రాజకీయ నేతలు ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. పశ్చిమబెంగాల్‌లో దాదాపు 80 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిల్లో దాదాపు 61 వేలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయన్నారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను అమలుచేయనున్నట్టు తెలిపారు.

# 48 గంటల్లో 51వేల కోట్లు!

## ఇది ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా వాడిన ఆయుధాల ఖర్చు



గడిచిన పది రోజులుగా ఇరాన్‌పై అమెరికా భీకరస్థాయిలో దాడులు చేస్తోంది. ఇందుకోసం అత్యాధునిక ఆయుధాలను వాడుతోంది. ఇలా యుద్ధం మొదలైన తొలి రెండు రోజుల్లోనే 5.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.51వేల కోట్లు) విలువైన ఆయుధ సామగ్రిని అమెరికా వినియోగించినట్టు వాషింగ్టన్ పోస్ట్ కథనం వెల్లడించింది. సైనికులు, యుద్ధవిమానాలు లేదా నౌకా దళాలను మోహరించేందుకు అయిన ఖర్చు దీనికి అదనమని పేర్కొంది. ఇరాన్‌పై ఫిబ్రవరి 28న యుద్ధం మొదలుపెట్టిన అమెరికా.. గగనతల రక్షణ వ్యవస్థలు, టోమాహాక్ క్రూయిజ్ క్షిపణులు సహా వందలాది అత్యాధునిక ఆయుధాలను ఉపయోగిస్తోంది. ఈ క్రమంలో ఆయుధాల వినియోగంపై ఇటీవల ఓ అంచనాల నివేదిక అమెరికా చట్టసభ ముందుకు వచ్చింది. ఏయే ఆయుధ సామగ్రిని ఎంత మొత్తంలో వినియోగించిందనే వివరాలు బయటకు తెలియనప్పటికీ.. తొలి రెండు రోజుల్లోనే ఉపయోగించిన ఆయుధ సామగ్రి విలువ రూ.5.6 బిలియన్ డాలర్లు ఉంటుందని కొందరు అధికారులు అంచనా వేశారు. మరోవైపు, పశ్చిమాసియాలో సైనిక ఆపరేషన్లను పర్యవేక్షించే అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకారం.. ఇప్పటివరకు 5వేల లక్ష్యాలపై దాడులు చేసినట్టు తెలుస్తోంది..

ఇలా ఖరీదైన ఆయుధాలను భారీ సంఖ్యలో వినియోగించడంపై కొందరు చట్టసభసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, వీరి వాదనను వైట్ హౌస్ వర్గాలు తోసిపుచ్చాయి. అధ్యక్షుడు నిర్ణయాలను అమలుచేసేందుకు రక్షణశాఖ సిద్ధంగా ఉందని పెంటగాన్ చీఫ్ అధికార ప్రతినిధి తెలిపారు. మరోవైపు, ఇరాన్‌లో దాడులను కొనసాగించేందుకు అవసరమైన అనుబంధ బడ్జెట్‌ను కాంగ్రెస్‌కు పంపించే యోచనలో ట్రంప్ యంత్రాంగం ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, ఈ బడ్జెట్ ప్రతిపాదనపై డెమొక్రాట్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఖర్గ్‌పై కన్నేసిన ట్రంప్?

**- ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసే వ్యూహానికి పదును**

**- చమురు ద్వీపాన్ని పేల్చేసే యోచనలో అమెరికా**

అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పది రోజులకిందట మొదలైన ఉద్రిక్తతలు చమురు నిక్షేపాల ధ్వంసంతో మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్ ఆర్థిక ఆయువుపట్టుపై బలమైన దెబ్బకొట్టేందుకు.. 'ఖర్గ్ ద్వీపం'పై దాడులకు ట్రంప్ యోచిస్తున్నట్టు సమాచారం. పశ్చిమాసియాలోని పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ తీరానికి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో 'ఖర్గ్' ఉంది. 20 చదరపు కిలోమీటర్ల అతి తక్కువ వైశాల్యంతో ఉన్నప్పటికీ.. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ఇది వెన్నెముక. ఇరాన్ చమురు ఎగుమతుల్లో 90 శాతం వాటా దీనిదే. అమెరికా ఆంక్షలు విధించినప్పటికీ, 2024లో ఈ ద్వీపం నుంచి చమురు ఎగుమతుల ద్వారా ఇరాన్ 78 బిలియన్ డాలర్లను ఆర్జించింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ నడవాలంటే ఇక్కడి చమురు ఎగుమతులే కీలకం. ఖర్గ్‌లోని లోడింగ్ టర్మినల్లు రోజుకు ఏడు మిలియన్ బ్యారెళ్ల చమురును హ్యాండిల్ చేయగలవని నివేదికలు చెప్తున్నాయి. యుద్ధానికి ముందు ఖర్గ్‌నుంచి రోజుకు 1.5 మిలియన్ బ్యారెళ్ల చమురు ఎగుమతి చేసిన ఇరాన్.. ఘర్షణల తరువాత ఎగుమతులను 4 మిలియన్ బ్యారెళ్లకు పెంచింది. ఖర్గ్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు ఎగుమతితో ఆర్థికంగా బలోపేతమవుతున్న ఇరాన్‌ను.. దీర్ఘకాలంలో దెబ్బతీయలేమని ట్రంప్ గ్రహించాడని అంటున్నారు. ఈ క్రమంలోనే ఆ ద్వీపంపై దాడులు జరిపి ఇరాన్ ఆర్థిక బలాన్ని వ్యూహాత్మకంగా దెబ్బతీయాలని యోచిస్తున్నట్టు సమాచారం.



ఖర్గ్‌పై దాడులు చేస్తే ఇరాన్‌ను దెబ్బతీయవచ్చన్న విషయం నిజమైనప్పటికీ, ఈ చర్య అటు అమెరికాకు, ఇటు ఇజ్రాయెల్‌కు కొత్త ఇబ్బందులు తేవచ్చని విశ్లేషకులు అంటున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ఇప్పటికే చమురు ధరలు బ్యారెల్‌కు 110–115 డాలర్లకు చేరుకొన్నాయి. ఇప్పుడు ఖర్గ్‌పై దాడులు జరిగితే ఈ ధరలు మరో 10 డాలర్ల మేర పెరిగే ప్రమాదముంది. ఖర్గ్ ద్వీపం హోర్ముజ్ జలసంధికి అతి సమీపంలో ఉంటుంది. దానిపై దాడులు జరిగితే, ఇంధన నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం జరుగొచ్చు. ఇరాన్‌పై దాడులు చేయడంవల్లే తమపై ఆ దేశం క్షిపణుల వర్షం కురిపిస్తున్నదని అమెరికా, ఇజ్రాయెల్‌పై గల్ఫ్ దేశాలు మండిపడుతున్నాయి. పశ్చిమాసియాలో కల్లోలానికి కారణమయ్యారంటూ సొంత ప్రజలనుంచే ట్రంప్, నెతన్యాహు విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో ఇరాన్‌ను దెబ్బతీయాలని ఖర్గ్‌మీద దాడికి పాల్పడితే, మొదటికే మోసం రావొచ్చని గ్రహించిన ట్రంప్ దాడుల విషయంలో తటపటాయిస్తున్నట్టు సమాచారం.

# యుద్ధం నుంచి వైదొలుగుదాం!



**- ట్రంప్‌పై వెత్తిడి పెంచుతున్న మిత్రులు**

**- కథనాన్ని తోసిపుట్టిన వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ**

ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపడుతోన్న నేపథ్యంలో.. వాల్ట్ జర్నల్ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ యుద్ధంనుంచి అమెరికా వైదొలుగుతున్నట్టు బహిరంగంగా ప్రకటించాలని.. అమెరికా అధ్యక్షుడు ట్రంపును ఆయన సలహాదారులు కోరుతున్నట్టు అందులో వెల్లడించింది. యూఎస్ అధికారిక వర్గాలనుంచి ఈ సమాచారం వచ్చినట్లు తెలిపింది. వాల్ట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ అణు వ్యవస్థలను నాశనం చేయాలన్న అమెరికా లక్ష్యం నెరవేరిందని.. ఆ దేశంపై యుద్ధంలో తాము అనుకున్న వాటికంటే ఎక్కువ లక్ష్యాలనే అమెరికా సైన్యం సాధించిందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు యుద్ధంనుంచి వైదొలిగినా ఎటువంటి నష్టం లేదని అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు, సుదీర్ఘ యుద్ధాలవల్ల సొంత ప్రజలనుంచే వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నందువల్ల యుద్ధం నుంచి వైదొలిగితేనే మంచిదని ట్రంప్‌నకు సూచించారు. కాగా ఈ కథనాన్ని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తోసిపుచ్చారు. ఇరాన్‌తో యుద్ధం విషయంలో ట్రంప్‌నకు ఎవరూ ఎటువంటి సలహాలు ఇవ్వలేదని స్పష్టంచేశారు. ఈ విషయంపై వస్తున్న కథనాల్లో నిజం లేదన్నారు. ఇరాన్ చేస్తున్న యుద్ధంలో విజయం సాధించడానికి ట్రంప్ పాలకవర్గంలోని అగ్ర సహాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అనుకున్న లక్ష్యాలను సాధించేవరకు ట్రంప్ తన పోరాటాన్ని ఆపరన్నారు. ఒకవేళ యుద్ధాన్ని ముగించాలని నిర్ణయం తీసుకుంటే ఆ విషయాన్ని కమాండర్ ఇన్ చీఫ్ బహిరంగంగా ప్రకటిస్తారని అన్నారు.



## భారత్-బంగ్లా.. బలపడుతున్న మైత్రి

ఇండియా–బంగ్లాదేశ్ మధ్య కొంతకాలంగా విబేధాలున్న సంగతి తెలిసిందే. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పాటు తరువాత ఈ పరిణామాల్లో మార్పు కనిపిస్తోంది. భారత్ బంగ్లాదేశ్‌తో ప్రస్తుతం సానుకూలంగానే స్పందిస్తోంది. తాజాగా బంగ్లాదేశ్‌కు ఇండియా 5,000 టన్నుల డీజిల్ సరఫరా చేసేందుకు సిద్ధమైంది. అదీ ఇరాన్ వార్ సంక్షోభ సమయంలో. గతంలో ఇండియా–బంగ్లాదేశ్ మధ్య చమురు సరఫరాపై ఒప్పందం కుదిరింది. దీనిలో భాగంగా ఇరు దేశాల మధ్య ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్ సైతం నిర్మించారు. అంతకు ముందు చమురు సరఫరా రైల్వేట్యాంకర్ల ద్వారా జరిగేది. బంగ్లాతో ఒప్పందం ప్రకారం ప్రతి ఏడాది బంగ్లాకు 1,80,000 టన్నుల డీజిల్‌ను భారత్ సరఫరా చేయాలి. ఐదేళ్లపాటు ఈ ఒప్పందం అమలులో ఉంటుంది. దీనిలో భాగంగా తొలి విడతగా 5,000 టన్నుల డీజిల్‌ను బంగ్లాకు భారత్ సరఫరా చేసింది. మంగళవారం నాటికి ఈ డీజిల్ బంగ్లాకు చేరుకుంటుందని అంచనా. అలాగే వచ్చే ఆరు నెలల్లో 90,000 టన్నుల డీజిల్ సరఫరా అవుతుందని భావిస్తున్నట్టు బంగ్లాదేశ్ పెట్రోలియం కార్పొరేషన్ ఛైర్మన్ ముహమ్మద్ రెజనూర్ రెహమాన్ అన్నారు. ఇది తమ దేశీయ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిజానికి ఇండియా ఎప్పటినుంచో బంగ్లాకు చమురు, విద్యుత్ సరఫరా చేస్తోంది. అక్కడ షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయాక పరిస్థితులు మారాయి. హిందువులపై దాడులు పెరిగాయి. బంగ్లా తాత్కాలిక సారథి యూనస్ ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. భారత్‌నుంచి చమురు కొనుగోలు నిలిపేసింది. అలాగే అదానీ సంస్థకు చెందిన ఝార్ఖండ్ పవర్ ప్లాంట్‌నుంచి విద్యుత్ తీసుకోవడాన్ని తగ్గించింది. కానీ, ఇప్పుడు బంగ్లాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో మళ్లీ పాత పద్ధతుల్లోనే ఇండియా–బంగ్లాదేశ్ మధ్య చమురు సరఫరా మొదలైంది.

## 'అందుకే.. ఇరాన్ నౌకలను ముంచేస్తున్నాం'

ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం అనంతరం ఇప్పటివరకు 5వేల లక్ష్యాలను ఛేదించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. తమ దాడులతో ఇరాన్ క్షిపణి సామర్థ్యం 10 శాతానికి పడిపోయిందన్నారు. మూడున్నర రోజుల్లో ఆ దేశానికి చెందిన 46 అగ్రశ్రేణి నౌకలను యూఎస్ మిలిటరీ ముంచేసిందంటూ వెల్లడించారు. ఈ సందర్భంగా సైనిక అధికారులతో జరిగిన సంభాషణను ప్రస్తావించారు. "ఇరాన్ డ్రోన్, క్షిపణి సామర్థ్యం పూర్తిగా ధ్వంసమవుతోంది. 46 నౌకలను ముంచేశామంటే నమ్మగలరా..? ఈ విషయంలో మన సైన్యంతీరు నాకు అంతగా నచ్చలేదు. దాంతో వెంటనే సైనికాధికారులతో మాట్లాడాను. ఆ నౌకలు ఎలాంటివని అడిగాను. అవి అగ్రశ్రేణి నౌకలని చెప్పారు. 'మరి అలాంటప్పుడు స్వాధీనం చేసుకొని మనం వాడుకోవచ్చు కదా..! ఎందుకు ముంచేశారు..? అని ప్రశ్నించాను. వాటిని ముంచడం సరదాగా ఉందని, అలా చేయడమే సురక్షితమని సమాధానమిచ్చారు. నాక్కూడా అది నిజమేనని అనిపించింది. ఇక మన సైన్యం ఇప్పుడు పశ్చిమాసియాకు విహారయాత్రకు వెళ్లింది. కొంత చెడును వదిలిస్తోంది. ఆ యాత్ర కొద్దికాలమే ఉంటుంది. అది మీరు కూడా చూస్తారు. శత్రువును పూర్తిగా ఓడించేవరకు మన మిలిటరీ వెనకడుగు వేయదు" అని పేర్కొన్నారు.

## డ్రోన్స్ తయారీలో ట్రంప్ ఫ్యామిలీ?



ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుటుంబం ఆయుధ తయారీపై దృష్టిపెట్టింది. పవరస్ అనే ప్రముఖ డ్రోన్ తయారీ కంపెనీలో పెట్టుబడులు పెట్టింది. ట్రంప్ కుమారులు ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్ ఈ సంస్థలో ప్రధాన వాటాదారులు. పవరస్ అనే డ్రోన్ తయారీ కంపెనీ ఇటీవల ఫ్లోరిడాలో గోల్ఫ్ కోర్సులను నిర్వహించే 'అరియాస్ గ్రీన్వే హోల్డింగ్స్' సంస్థలో విలీనమైంది. కొత్త సంస్థ పేరు కూడా పవరస్‌గా కొనసాగుతోంది. ఈ కంపెనీ ప్రమాదకరమైన వాతావరణాల్లోనూ మిలిటరీ, పౌర అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లను తయారు చేస్తోంది. ట్రంప్ జూనియర్ గతంలో 'అన్యూజువల్ మెషిన్స్' అనే డ్రోన్ తయారీ స్టార్టప్‌లో పెట్టుబడులు పెట్టారు. అమెరికా ఇరాన్‌తో యుద్ధాన్ని కొనసాగిస్తోన్న సమయంలో ట్రంప్ కుటుంబం డ్రోన్ తయారీ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.. ఇదీ

చైతన్యరథం

స్పోర్ట్స్




# టీమ్ ఇండియాకు భారీ నజరానా

టీమిండియా ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026 విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 96 పరుగుల భారీ తేడాతో భారత్ విజయం సాధించింది. ఈ నేప థ్యంలో బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) టీమ్ ఇండియాకు మంగళవారం రూ.131 కోట్ల భారీ నజరానా ప్రకటించింది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా ధ్రువీకరించారు. ఈ విజయంతో.. ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచ కప్‌లో మూడు సార్లు విజయం సాధించిన మొదటి జట్టుగా ఇండియా నిలిచింది. ఈ ఫార్మాట్ చరిత్రలో అత్యంత విజయవం తమైన జట్లలో ఒకటిగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుం ది' అని అన్నారు. అద్భుతమైన ప్రదర్శనతో టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన టీమ్ ఇండియాకు బీసీసీఐ 131 కోట్ల నగదు బహుమతిని ప్రకటించిందని చెప్పారు.

***ఆరు కోట్లు పెంచిన బీసీసీఐ***

2024లో టీమ్ ఇండియా టీ20 ప్రపంచ కప్ గెలిచినప్పుడు కూడా బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. అప్పుడు 125 కోట్ల రూపాయల బహుమతి ఇచ్చింది. ఈసారి ఆరు కోట్ల రూపాయలు పెంచి 131 కోట్ల రూపాయల బహుమతి ప్రకటించింది. ఐసీసీ కూడా టీ20 ప్రపంచ కప్ 2026 విజేతగా నిలిచిన టీమ్ ఇండియాకు రూ.21.5కోట్లు.. రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్‌కు రూ.10.75 కోట్లు ప్రకటించింది.

డారిల్ మిచెల్‌తో గొడవ..

# అర్ష్‌దీప్ సింగ్‌కు జరిమానా







టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై ఐసీసీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో డారిల్ మిచెల్, అర్ష్‌దీప్ మధ్య వాగ్వాదం జరిగిన సంగతి తెలిసిందే. కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘ నకు పాల్పడినందకు ఆయన మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానాతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ విధించింది. ఆటగాళ్ల ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.9ను ఉల్లంఘించాడు. మ్యాచ్ సమయంలో బంతిని లేదా ఇతర క్రికెట్ సామగ్రిని మరో ఆటగాడి వైపు ప్రమాదక రంగా విసిరడం చాలా తప్పు' అని ఐసీసీ తన ప్రకటనలో పేర్కొంది.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?**

ఫైనల్ మ్యాచులో 255 పరుగుల ఛేదనలో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్ ఆది నుంచి తడబడుతూ వచ్చింది. అయితే 11వ ఓవర్ వేసిన అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో డారిల్ మిచెల్ వరుసగా రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు. అప్పటికే వైడ్లు వేస్తూ.. వికెట్ కూడా తీయకపోవడంతో అర్ష్‌దీప్ కాస్త అగ్రెషన్‌కు గురయ్యాడు. ఈ నేపథ్యంలో అదే ఓవర్ ఐదో బంతికి నాన్‌స్ట్రైకర్ ఎండ్ వైపు మిచెల్ ఆడాడు. అయితే ఫాలో త్రులో బంతిని అందుకున్న అర్ష్‌దీప్ కోపంతో వికెట్ల వైపు త్రో విసిరాడు. ఆ బంతి నేరుగా వెళ్లి మిచెల్‌కు బలంగా తాకింది. క్రీజులో ఉన్నప్పటికీ తనపైకి బంతి విసరడంతో మిచెల్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. అర్ష్‌దీప్ వైపు కోపంగా చూస్తూ గట్టిగా అరుస్తూ అతడి వైపు వెళ్లాడు. అయినా అర్ష్‌దీప్ తొలుత క్షమాపణ చెప్పకుండా వెనక్కి నడవడంతో మిచెల్ మరింత ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెంటనే సూర్యకుమార్ యాదవ్ జోక్యం చేసుకుని మిచెల్‌కు సర్దిచెప్పాడు. అంపైర్ కూడా అర్ష్‌దీప్‌ను పిలిచి హెచ్చరించాడు. అయితే ఓవర్ ముగిసిన తర్వాత అర్ష్‌దీప్ స్వయంగా మిచెల్ దగ్గరకు వెళ్లి క్షమా పణ చెప్పాడు. ఇద్దరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడంతో ఆ వివాదం అక్కడితో ముగిసింది. మ్యాచ్ అనంతరం కూడా మిచెల్, అర్ష్‌దీప్ కలిసి మాట్లాడుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# శ్రీలంక-అఫ్గానిస్తాన్ మ్యాచ్‌లు రద్దు




పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం వల్ల శ్రీలంక-అఫ్గానిస్తాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌లు రద్దు అయ్యాయి. షెడ్యూల్ ప్రకారం మార్చి 13 నుంచి 25 వరకు శ్రీలంక-అఫ్గానిస్తాన్ జట్ల మధ్య దుబాయ్ వేదికగా వైట్ బాల్ సిరీస్ ప్రారంభం కావాల్సి ఉంది. కానీ పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రస్తుతం ఆ సిరీస్ రద్దైంది. ఈ విషయాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డుకు సంబంధించి ఓ అధికారి ధ్రువీకరించారు. 'ఆ ప్రాంతంలో యుద్ధ పరిస్థితుల వల్ల విమానాల రాకపోకలు సరిగా లేవు. దీంతో సిరీస్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది' అని ఆ అధికారి తెలిపారు. వాస్తవానికి షార్జా వేదికగా మార్చి 13 నుంచి అఫ్గానిస్తాన్, శ్రీలంకల మధ్య మూడు టీ20లు, మార్చి 20, 22, 25 తేదీల్లో మూడు వన్డే మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. కానీ అక్కడ ఉద్రిక్తతల కారణంగా ఇప్పుడప్పుడే ఆ సిరీస్ నిర్వహించే అవకాశాలు కనిపించడం లేదు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచ కప్‌లో కూడా పలు జట్లు విమాన రాకపోకల్లో అంతరాయం వల్ల స్వదేశాలకు చేరుకోవడంలో ఇబ్బంది పడిన విషయం తెలిసిందే.


# ఐపీఎల్-2026 మొదలయ్యేది అప్పుడే

- త్వరలో ఫిక్స్ కానున్న షెడ్యూల్
- బీసీసీఐ కార్యదర్శి అధికారిక ప్రకటన




ఐపీఎల్ క్రికెట్ అభిమానులకు అదిరిపోయే వార్త వచ్చేసింది. గతకొన్ని రోజులుగా ఊరిస్తున్న ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబం ధించిన షెడ్యూల్ విడుదల తేదీ వచ్చేసింది. మార్చి 12న లీగ్ తొలి 20 రోజుల షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అధికారికంగా ప్రకటించారు. దేశం లోని పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పూర్తి షెడ్యూల్ ప్రకటించడంలో ఆలస్యం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత మిగతా షెడ్యూల్‌ను ప్రకటిస్తామని దేవజిత్ సైకియా వెల్లడించారు. కాగా, ఐపీఎల్ 2026 సీజన్ తొలుత మార్చి 26న ప్రారంభమవుతుందని ప్రకటించినా తర్వాత 28వ తేదీకి మార్చిన సంగతి తెలిసిందే. మే 31న జరిగే ఫైనల్‌తో ఈ సీజన్ ముగియనుంది. ఈ ఏడాది పశ్చిమబెంగాల్, అస్సాం, తమిళనాడు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. వీటిల్లో బెంగాల్, తమిళనాడుకు ఐపీఎల్ టీమ్స్ ఉండటం, అక్కడ హోమ్ గ్రౌండ్ మ్యాచులు జరగాల్సి ఉండ టంతో భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా బీసీసీఐ జాగ్రత్త పడుతోంది. ఎన్నికల తేదీలకు అనుగుణంగా మ్యాచులను సర్దుబాటు చేయాల్సి రావడం తో షెడ్యూల్‌ను విడతల వారీగా ప్రకటిస్తున్నారు. సాంప్రదాయం ప్రకారం గత సీజన్ విజేతలు, రన్నరప్ జట్లు సీజన్ తొలి మ్యాచ్ ఆడతాయి. ఈ విధంగా చూసినట్లు అయితే తొలి మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగే అవకాశం ఉంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఓపెనింగ్ మ్యాచ్ జరుగుతుందని ఇప్పటికే బీసీసీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల స్టార్ స్పోర్ట్స్ విడుదల చేసిన పోస్టర్‌లో ఐపీఎల్ ట్రోఫీ చుట్టూ పసుపు, గులాబీ రంగు రిబ్బన్లు ఉండటంతో సీఎస్కే, రాజస్థాన్ రాయల్స్ మధ్య తొలి మ్యాచ్ జరుగుందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై స్పష్టత రావాలంటే మరో రెండు రోజులు వేచి చూడాల్సిందే.

# పెళ్లి పీటలెక్కనున్న కుల్‌దీప్



టీమిండియా స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నాడు. టీ20 ప్రపంచ కప్ దృష్ట్యా తన వివాహాన్ని కుల్‌దీప్ వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. టోర్నీ ముగియడంతో పెళ్లి మాట మళ్లీ తెరపైకి వచ్చింది. తన చిన్న నాటి స్నేహితురాలు వన్షికతో మార్చి 14న ఉత్తరాఖండ్ లోని ముస్సోరి రిసార్ట్‌లో కుల్‌దీప్ వివాహం జరగనుంది. మార్చి 17న లఖ్‌నవూలో రిసెప్షన్ జరగనుంది. కుల్‌దీప్ యాదవ్, వన్షికలకు గతేడాది జూన్ 4న నిశ్చితార్థం జరిగింది. ఆమె తండ్రి ఎల్ఐసీ ఉద్యోగి. నిజానికి ఈ వివాహం గతేడాది నవంబర్‌లోనే జరగాల్సి ఉంది. కానీ టీ20 ప్రపంచ కప్ నేపథ్యంలో వాయిదా పడింది. కుల్‌దీప్ తండ్రి రామ్‌సింగ్ యాదవ్ మార్చి 8న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్‌ను వ్యక్తిగతంగా కలిసి తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు.

కుల్‌దీప్ యాదవ్, వన్షిక ఇద్దరూ కాన్పూర్‌కు చెందినవారే. ఇద్దరి ఇళ్లు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో చిన్ననాటి నుంచే స్నేహం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. అత్యంత త్వరలోనే పెళ్లి పీటలెక్కుతుంది. అయితే ఈ పెళ్లి వేడుకకు బీసీసీఐ అధికారులు, ప్రస్తుత, మాజీ క్రికెటర్లు హాజరయ్యే అవకాశం ఉంది. కుల్దీప్ దీర్ఘకాల కోచ్ కపిల్ దేవ్ పాండే తెలిపిన వివరాల ప్రకారం, మార్చి 13న హల్దీ, మెహందీ కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమవుతాయి.

# నాన్నా.. మిస్ యూ!




టీ20 ప్రపంచ కప్ 2026 ఫైనల్ మ్యాచ్‌కు కొద్ది రోజుల ముందు టీమిండియా స్టార్ క్రికెటర్ రింకు సింగ్ తండ్రి లివర్ క్యాన్సర్‌తో పోరాడి మరణించిన సంగతి తెలిసిందే. పుట్టెడు దు:ఖంలోనూ రింకు తండ్రి అంత్యక్రియలు ముగించుకుని తిరిగి జట్టుతో కలిశాడు. జట్టుకు అవసరం అయినప్పుడల్లా ఫీల్డింగ్‌కు దిగాడు. అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్‌పై టీమిండియా గెలిచి టీ20 వరల్డ్ కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో రింకు సింగ్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. 'నాన్న.. మీతో మాట్లాడకుండా రోజు గడిచేది కాదు. మీరు లేకుం డా నా జీవితం ఇక ముందు ఎలా ఉంటుందో తెలియడం లేదు. నా ప్రతి అడుగులోనూ మీరు తోడుగా ఉండాలి. విధి నిర్వహణ తర్వాతే ఏదైనా అని మీరు చెబుతుండేవారు. మీ కలను నిజం చేయడానికే నేను మైదానంలోకి దిగాను. మీ కల నెరవేరింది. మీరు ఇప్పుడు నాతోపాటు ఉంటే బాగుండేది. చిన్నదైనా, పెద్దదైనా ప్రతి ఆనందంలోనూ మీరు లేని లోటు తెలుస్తోంది. నేను మిమ్మ ల్ని చాలా మిస్ అవుతున్నా. మిస్ యూ నాన్నా' అంటూ రింకు పోస్ట్‌లో పేర్కొన్నాడు.

చైతన్య రథం
సినిమా
బుధవారం 11 మార్చి 2026 X

# మల్టీస్టారర్.. టైం టేకింగ్ ప్రాజెక్టే



ప్రస్తుతం సినీ ప్రేక్షకుల దృష్టంతా సూపర్‌స్టార్ రజనీకాంత్, యూనివర్శల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించ బోతున్న భారీ మల్టీస్టారర్‌పైనే ఉంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించనున్నట్లు సమాచారం. ప్రాజెక్ట్‌కు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియోతో అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ తమదైన స్టైల్, స్వాగ్‌తో తెరపై కనిపిస్తే సినిమా మరో లెవెల్‌లో ఉంటుందనే నమ్మకం కలిగింది. అయితే సినిమా ప్రారంభం, విడుదల తేదీలపై విభిన్న వార్తలు వస్తున్నాయి. తమిళ సినీవర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. దర్శకుడు నెల్సన్ "జైలర్ 2" పనుల్లో బిజీగా ఉన్నాడు. సినిమా పూర్తయ్యే వరకు మల్టీస్టారర్‌పై పూర్తి దృష్టి పెట్టే ఛాన్స్ లేదు. అందువల్ల మల్టీస్టారర్ ప్రాజెక్ట్ ప్రారంభానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశముంది. 2026 చివర్లో ఈ సినిమాను పట్టాలెక్కించే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాల మాట. భారీ మల్టీస్టారర్‌ను లెజండరీలు ఇద్దరికీ సమాన ప్రాధాన్యత ఉన్న పాత్రలుండేలా కథను సిద్ధం చేస్తున్నారట. యాక్షన్, ఎమోషన్, డ్రామా మేళవింపుతో పాటు ఇద్దరి కాంబినేషన్ సీన్స్ సైతం ఎక్కువుండేలా స్క్రిప్ట్ రూపొందిస్తున్నట్లు టాక్. షూటింగ్ ప్రారంభమైన ఆరు నెలల్లోనే ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం రజనీకాంత్ "జైలర్–2"తో బిజీగా ఉంటే, కమల్‌హాసన్ ఆయన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇద్దరి డేట్స్ సమన్వయం చేసుకుని ప్రాజెక్టు పూర్తి చేసేసరికి.. విడుదల 2027కు వెళ్లొచ్చన్నది ఒక అంచనా. ఒకవేళ డేట్స్ లేదా ఇతర కారణాలతో ఆలస్యమైతే 2028కి వెళ్లినా ఆశ్చర్యపడాల్సిన పని లేదు.

# ఉస్తాద్.. సెన్సార్ పూర్తి

పవన్ కళ్యాణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సెన్సార్ పూర్తి చేసుకుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు యు/ఎ సర్టిఫికేట్ జారీ చేసినట్టు చిత్రబృందం ప్రకటించింది. గతంలో పవన్ నటించిన ఓజీ చిత్రానికి గ్యాంగ్‌స్టర్ డ్రామా కారణంగా ఎ సర్టిఫికేట్ రాగా, ఈసారి 'ఉస్తాద్'కు యు/ఏ రావడంతో కుటుంబ ప్రేక్షకులంతా కలిసి చూసే అవకాశం లభించబోతుంది. మరోవైపు ఈ సినిమా మొత్తం 2 గంటల 29 నిమిషాల రన్‌టైమ్‌తో రాబోతుందని సమాచారం. ప్రస్తుత కాలంలో వస్తున్న భారీ సినిమాలతో పోలిస్తే, ఈ కాంపాక్ట్ నిడివి సినిమాకు ప్లస్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎక్కడా బోర్ కొట్టకుండా పక్కా కమర్షియల్ ప్యాకేజీతో హరీష్ శంకర్ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశీఖన్నా ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలకు ఇప్పటికే భారీ రెస్పాన్స్ వస్తుండగా, తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో లెవల్‌కు తీసుకువెళ్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.



# బన్నీ థీమ్‌కు మ్యాడ్ క్రేజ్




కాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా ఇప్పుడు కోలీవుడ్ దర్శకులతో వరుస సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఆల్రెడీ దర్శకుడు అట్లీతో భారీ ప్రాజెక్ట్‌ని చేస్తుండగా ఈ సినిమా తర్వాత టాలెంటెడ్ దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో మరో క్రేజీ ప్రాజెక్ట్‌ని సెట్ చేసుకున్నాడు. అయితే లోకేష్ కనగరాజ్‌తో సినిమా ఇంకా మొదలు కాలేదు కానీ దీనిపై ఉన్న హైప్ మాత్రం అంతా ఇంతా కాదు. ఈ సినిమా అనౌన్సమెంట్ కోసం డిజైన్ చేసిన స్పెషల్ థీమ్ సాంగ్‌కి సెన్సేషనల్ రెస్పాన్స్ ఇప్పటికీ కొనసాగుతుంది. ఫాస్టెస్ట్ 5 లక్షలనుంచి 1 మిలియన్ రీల్స్ రికార్డు సొంతం చేసుకున్న ఈ థీమ్.. ఇప్పుడు ఫాస్టెస్ట్ 1.5 మిలియన్ మార్క్ క్రాస్ చేసేసింది.

దీంతో సినిమా ఇంకా మొదలు కాకుండానే ఊహించని రీచ్‌ని సొంతం చేసుకుందని చెప్పొచ్చు. ఒకవేళ సినిమా మొదలై ఒకో కంటెంట్ బయటకి వస్తే ఎలా ఉంటుందో చూడాలి మరి. ఇక ఈ సినిమాకి అనిరుద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ ఏడాదిలోనే షూట్ మొదలు పెట్టుకోనుంది.



# అవతార్-4.. ఆలోచనవద్దే ఉంది

సినీ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసిన హాలీవుడ్ దర్శకుడు జేమ్స్‌కామెరూన్.. అవతార్ చిత్రానికి కొనసాగింపుగా రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు తెచ్చిన సంగతి తెలిసిందే. మొదటి సినిమాతో పోలిస్తే, తర్వాత వచ్చిన చిత్రాలు విజువల్ వండర్స్‌గా అలరించినా, బలమైన కథా వస్తువు లేకపోవడం మైనస్ అయ్యింది. వసూళ్లపరంగా మాత్రం రెండూ బాగానే మెప్పించాయి. ఇక ఈ ఫ్రాంచైజీలో మొత్తం 5 సినిమాలను తీసుకురానున్నట్టు జేమ్స్ కామెరూన్ ఇప్పటికే ప్రకటించారు. మూడు సినిమాలు ఇప్పటికే ప్రేక్షకుల ముందుకురాగా, 'అవతాంర్–4' అప్డేట్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా జరిగిన శాటర్న్ అవార్డులవేడుకలో జేమ్స్ కామెరూన్ నాలుగో పార్ట్‌పై స్పందించారు. ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. "సీక్వెల్స్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కానీ, సెట్స్ పైకి తీసుకెళ్లే అవకాశం పుష్కలంగా ఉంది. ఈ విషయంలో ప్రేక్షకుల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకుంటాం. ఇప్పటివరకూ వచ్చిన మూడు చిత్రాలను మరోసారి సమీక్షించుకుని ముందుకు వెళ్తాం" అన్నారు. మొదటి పార్ట్ ఇచ్చినంత కిక్.. తర్వాత వచ్చిన రెండు, మూడు పార్టులు ఇవ్వలేదన్నది జగమెరిగిన సత్యం. మరీ ముఖ్యంగా ఒకే కథను నేపథ్యం మార్చి విజువల్స్ మాయ చేశారన్నది కాదనలేని వాస్తవం. ఈ విషయం జేమ్స్ కామెరూన్‌కూ తెలుసు. అందుకే 'అవతార్–4' విషయంలో ప్రేక్షకుల అభిప్రాయాలను తీసుకుంటానని అంటున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 71 ఏళ్లు. వయసు పెరుగుతున్నరీత్యా కామెరూన్ కూడా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందట. రెండు సినిమాలకు సంబంధించిన కథను సిద్ధం చేసుకుని, ఒకేసారి షూటింగ్ కూడా పూర్తి చేసే ఆలోచనలో ఉన్నారట. ఎంత ప్లానింగ్‌తో ముందుకెళ్లినా కచ్చితంగా ఈ రెండు సినిమాలకు ఐదారేళ్లు పడుతుంది. ఇప్పటివరకూ కామెరూన్ స్వయంగా ప్రకటించిన తేదీల ప్రకారం 'అవతార్–4'ని 2029లో, 'అవతార్–5'ని 2031లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలి.




# సత్యవతిగా రీతూ..

హీరో గోపీచంద్ మరో ప్రతిష్ఠాత్మక చిత్రంతో అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. గోపీచంద్ 33వ చిత్రంగా ఇది ప్రచారంలో ఉంది. భారీ బడ్జెట్‌తో రానున్న ఈ సినిమాలో రీతూ వర్మను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఆమె పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రీతూ 'సత్యవతి' పాత్రలో కనిపించనున్నట్టు తెలిపారు. పోస్టర్‌లో ఆమె లుక్ పవర్ఫుల్గా, పాత్రకు తగ్గట్టుగా వైవిధ్యంగా కనిపిస్తోంది. 7వ శతాబ్దానికి చెందిన, చరిత్రలో పెద్దగా వెలుగులోకి రాని ఓ యదార్థ సంఘటన నేపథ్యంలో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా తెరకెక్కుతుండటం విశేషం. మరింత సమాచారం, ఇతర నటీనటుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్స్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# అవి.. ఏఐ స్వాప్ మార్ఫింగ్!

బాలీవుడ్‌లో రూపుదిద్దుకుంటున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సోషల్ మీడియాలో రణబీర్,సాయిపల్లవి ఫొటో ఒకటి తెగ వైరలవుతోంది. సినిమా షూటింగ్ సెట్స్ నుంచి రాముడు, సీతలుగా రణబీర్‌తో, సాయిపల్లవిల ఫొటోలు లీక్ అయ్యాయన్నది సోషల్ మీడి యా కంటెంట్. అయితే ఈ ప్రచారంపై చిత్రబృందం స్పందిస్తూ.. ఆ ఫొటోలు నకిలివని..అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో సృష్టించిన ఫేస్–స్వాప్‌చిత్రాలని చిత్ర బృందం క్లారిటీ ఇచ్చింది. 2015లో ప్రసారమైనసియా కే రామ్'సీరియల్‌లోని స్టిల్స్ తీసుకుని, అందులోని నటీ నటుల ముఖాలకు బదులుగా రణబీర్, సాయి పల్లవి ముఖాలను ఆకతాయిలు ఎడిట్‌చేసినట్టు చిత్రబృందం తెలిపింది. నితీష్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ప్రతిష్ఠాత్మక రామాయణలో రణబీర్ కపూర్,సాయి పల్లవితోపాటు రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీడి యోల్ నటిస్తున్నారు. భారీ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో మొదటిభాగం2026 దీపావళికి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉండగా, అధికారిక పోస్టర్లు త్వరలోనే విడుదల కానున్నాయి.

# నిన్నుచూసి గర్వపడుతున్నా

తన పెద్ద కుమార్తె సుస్మితకు అగ్రకథానాయకుడు చిరంజీవి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని అరుదైన ఫొటోలు పంచుకున్న ఆయన.. సుస్మితను చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. "నా వేలు పట్టుకొని నా పక్కన నడిచిన చిన్నపిల్లవి.. ఇప్పుడు బాధ్యతగల మహిళగా ఎదిగావు. నా సినిమాలు చూస్తూ పెరిగిన నువ్వు.. ఇప్పుడు నా సినిమాలు నిర్మించే స్థాయికి ఎదగడం తండ్రిగా నాకు చాలా ఆనందంగా ఉంది. నాకు బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందించావు. అది నాకెంతో గర్వకారణం" అంటూ సుస్మితకు చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాను సుస్మిత నిర్మించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన చిత్రం రూ.375 కోట్లు వసూలు చేసింది. ఎన్నో రికార్డులు క్రియేట్ చేసిన ఈ సినిమా 109 సెంటర్లలో విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకుంది. దీంట్లో చిరుకు జోడీగా నయనతార నటించగా.. హీరో వెంకటేశ్ ప్రత్యేక పాత్రలో అలరించారు.

